బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం, 26 మార్చి-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

పెట్రోల్, డీజిల్, గ్యాస్ కోసం ప్రజల ఆందోళన

పెట్రోలు కొరత లేదు

దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

- ఇంధన ధరల్లో కూడా మార్పులు లేవు
- దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ సరఫరా
- బ్లాక్ మార్కెటింగ్‌పై దాడులు కొనసాగిస్తున్నాం
- పైప్డ్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో దానికే ప్రాధాన్యం
- ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ మరోమారు ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 25:
పైపులతో నేచురల్ గ్యాస్ కు తాము ప్రాధాన్యం ఇస్తున్నామని, పెట్రోల్, డీజిల్‌కు దేశంలో ఎలాంటి కొరత లేదని, ఇంధనం ధరల్లో కూడా మార్పు లేదని పెట్రోలియం మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. వదంతులు నమ్మ వద్దని కోరింది. గృహావసరాల కోసం వంద శాతం పీఎన్‌జీ సరఫరాకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి

మిగతా 3లో..

డీలర్లు స్వయంగా ప్రకటన చేశారు
కొందరు కావాలనే పుకార్ల వ్యాప్తి
కేంద్రమంతరి బండి సంజయ్ వెల్లడి

హైదరాబాద్, మార్చి 25:
తెలంగాణ రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మొద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయిల్ సంస్థల వద్ద సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయంటూ.. తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. పెట్రోలు, డీజిల్ కొరత రాకుండా ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలని కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయని, ఆ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వాహనదారులు రోజువారీ అవసరాల మేరకు.. పెట్రోలు, డీజిల్‌ను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వస్తున్న పుకార్లపై ఆయన స్పందిస్తూ.. 'అమెరికా, ఇజ్రాయిల్ ? ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్ కొరత ఏర్పడిందంటూ సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదు. ఇండియన్ ఆయిల్, హెచ్ పీసీఎల్, బీపీసీఎల్ వంటి అన్ని పబ్లిక్ సెక్టార్ ఆయిల్ కంపెనీల వద్ద అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉంది. పెట్రోలు, డీజిల్ సరఫరాలోనూ లోపం లేదు. రాష్ట్ర అవసరాలకు సరిపడా పెట్రోలు, డీజిల్ సరఫరా నిరాటంకంగా కొనసాగుతోంది. ఇదే విషయాన్ని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోషియేషన్ కూడా స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మి చాలా మంది పెట్రోలు బంకుల వద్దకు పరుగులు తీస్తూ అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల ఒక్కసారిగా డిమాండ్

మిగతా 3లో..

దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేయాలి

- రేవంత్ రెడ్డి మళ్లీ సిఎం కావడం కల్ల
- అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్

హైదరాబాద్, మార్చి 25:
రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం అవుతానని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేయాలంటూ రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. అసెంబ్లీ లాబీలో హరీష్ రావు చిట్‌చాట్‌లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తల్లకిందులుగా తపస్సు చేసినా రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కాలేరని అన్నారు. అసెంబ్లీ నిర్వహణపై కూడా ఆయన విమర్శలు చేశారు. సభను సమయానికి ప్రారంభించడం లేదని, టీ బ్రేక్

మిగతా 3లో..

కవిత పార్టీకి ముహూర్తం ఖరారు

- 27న శ్రీరామనవమి రోజు పార్టీ పేరు ప్రకటన

హైదరాబాద్, మార్చి 25:
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 27న శ్రీరామనవమి రోజు పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన చేసే అవకాశముందని సమాచారం. శ్రీరామ నవమి రోజు ఉదయం 8 గంటలకు కొత్త పార్టీ ఏర్పాటు తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన ముఖ్య అంశాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తన మెట్టినిల్లు నుంచి పార్టీ సింబల్, విధివిధానాలు ప్రకటించే అవకాశం ఉందని జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, కవిత తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ఇదే సందర్భంలో వెల్లడించవచ్చని చర్చ జరుగుతోంది.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- అసంపూర్తిగా ఉన్నవాటిని పూర్తి చేస్తాం
- స్వాధీనం చేసుకోని ఇళ్లకు కొత్తవారికి కేటాయిస్తాం
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో చర్చలో మంత్రి పొంగులేటి

మిగతా 3లో..

స్థిరంగానే భారత్ ఇంధన భద్రత

- మరిన్ని నౌకలు భారత్‌కు చేరుకునే అవకాశం
- పశ్చిమాసియా పరిస్థితులపై అఖిలపక్షంలో ప్రభుత్వం వివరణ
- సమస్య ఎదుర్కొనేందుకు ఉమ్మడిగా సాగాలని నిర్ణయం

న్యూఢిల్లీ,మార్చి25 : భారతదేశ ఇంధన భద్రత స్థిరంగా ఉందని, అదనపు సరకుతో నౌకలు వస్తున్నాయని కేంద్ర అన్ని రాజకీయ పార్టీలకు భరోసా ఇచ్చింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం పార్లమెంటు భవనంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఒక గంటా 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, కాంగ్రెస్ నేతలు ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు ధర్మేంద్ర యాదవ్,జావెద్ అలీ, సీపీఎం నేత జాన్ బ్రిట్టాస్, ఎల్‌జేపీ నేత అరుణ్ భారతి, డీఎంకే నేత పి.విల్సన్, ఆప్ ఎం సంజయ్ సింగ్, జేడీయూ నేత రాజీవ్ సింగ్, సంజయ్ ఝా తదితరులు పాల్గొన్నారు. టీఎంసీ నుంచి ఎవరూ హాజరుకాలేదు. అఖిలపక్ష సమావేశానంతరం కిరణ్ రిజిజు మాట్లాడుతూ, సమావేశంలో అన్ని పార్టీలు చురుకుగా పాల్గొన్నాయని, ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధం, భారత్‌పై దాని ప్రభావంపై సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశాయని తెలిపారు. ప్రభుత్వం సమగ్రంగా, సంపూర్ణంగా స్పందించిందని, విపక్షాలందరి ప్రశ్నలన్నింటికీ

మిగతా 3లో..

పాక్ లాగా భారత్ దళారీ దేశం కాదు

- అఖిలపక్షంలో విదేవాంగ మంత్రి జైశంకర్



న్యూఢిల్లీ,మార్చి25 : పాకి స్థాన్‌ను 'దళారీ' దేశంగా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అభివర్ణిం చారు. పాకిస్థాన్‌లాగా భారతదేశం ఎప్పుడూ మధ్యవర్తిత్వం నెరపే దేశం, దళారీ దేశం కాదని అన్నారు. పశ్చి మాసియాలో నెలకొన్ని ఉద్రిక్తతలపై కేంద్రం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. పశ్చి మాసియాలో యుద్దానికి ముగింపు పలికేలా వాషింగ్టన్– టెహ్రాన్‌తో మధ్యవర్తిత్వం వహించేందుకు పాక్ ముందుకు రావడంపై అఖిలపక్ష సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్టు చెబుతు న్నారు. దీనిపై జైశంకర్ స్పందిస్తూ, పాకిస్థాన్ దళారీ దేశమని అన్నా రు. అంతర్జాతీ య భౌగోళిక రాజకీయాల్లో భారత్ దళారీ దేశంగా వ్యవహరించదని చెప్పారు. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నాలుగో వారానికి చేరుకోవడంతో మధ్యవర్తిత్వం వహించడా నికి పాక్ ఉత్సా హం కనబరుస్తోంది. చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు తాము సిద్ధమని పాక్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత్ ఎందుకు మౌనంగా ఉం దని విపక్షాలు ప్రశ్నించినప్పుడు, భారత్‌కు ప్రత్యేక గౌరవం ఉందని, ఎన్నడూ దళారీ దేశంగా వ్యవహరించదని జైశంకర్ వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో పెట్రో, గ్యాస్ కొరత లేదు

- అపోహలు, వదంతులు నమ్మవద్ద
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క స్పష్టీకరణ

హైదరాబాద్, మార్చి 25:
హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలి సమావేశపు హాలులో రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావులతో కలిసి గ్యాస్, పెట్రోల్ సరఫరాలను సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, గ్యాస్ నిల్వలు, పంపిణీలో ఎటువంటి ఇబ్బంది లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అపోహలు కలిగించే మాధ్యమాల కథనాలతో ఆందోళన చెందవద్దని వినియోగదారులకు సూచించారు. రెగ్యులర్ గా కొనుగోలు చేసే దాని కంటే, ఎక్కువగా కొని నిల్వ చేయవద్దని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. బంకుల వద్దకు వచ్చే చివరి వాహనదారునికి కూడా పెట్రోల్, గ్యాస్ దొరుకుతుందనే భరోసా కల్పించాలని అధికారులు, ఏజెన్సీ లను ఆదేశించారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచుటకు రెగ్యులర్ గా ప్రెస్ బ్రీఫింగ్స్ ఇవ్వాలని సూచించారు. బ్లాక్ మార్కెట్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులని ఆదేశించారు. పెట్రోల్, గ్యాస్ ఏజెన్సీ లకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే వార్తల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంధన కొరత లేదని, అవసరానికి సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్ రాష్ట్రంలో ఉందని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తోందని, అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. సివిల్ సప్లై శాఖ మొత్తం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని తెలిపారు. ప్రజలు రూమర్స్, ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యంగా డ్రమ్స్, కంటైనర్లలో పెద్ద ఎత్తున ఇంధనం నిల్వ చేయడం చట్ట విరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంధన డిమాండ్ సుమారు 25 శాతం పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 1200 ట్యాంకర్ల ద్వారా సరఫరా జరుగుతోందని చెప్పారు. పెట్రోల్ బంకలు అనవసరంగా మూసివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అహ్మదాబాద్, సూరత్, నాగపూర్, చెన్నై వంటి నగరాల్లో కూడా ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే బంకలకు ఎలాంటి క్రెడిట్ సమస్యలు లేవని, సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, కమిషనర్ కర్ణన్, పోలీసు కమిషనర్లు సజ్జన్నార్, సుధీర్ బాబు, ఆయిల్ కంపెనీల ఏజెన్సీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పార్టీ మారలేదన్న ఎమ్మెల్యేల కేసు

స్పీకర్‌తో సహా ఏడుగురికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మార్చి 25: పార్టీ మారలేదన్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సైతం కోర్టు నోటీసులు ఇచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని ఇటీవల అసెంబ్లీ స్పీకర్ తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై ఈ రోజు విచారణ జరిగింది. దాంతో కౌంటర్ దాఖలు చేయాలంటూ ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీ చేసిన జాబితాలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికేపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్ రావు ఉన్నారు. ఏప్రిల్ 16వ తేదీ ఈ కేసు విచారణను వాయిదా వేసింది.

జీవన్ రెడ్డి పార్టీని వీడడం బాధాకరం

పార్టీలో ఉంటూనే పోరాడాల్సింది: మల్లు

హైదరాబాద్, మార్చి 25: మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి క్రమశిక్షణతో పని చేశారని, ఆయన పార్టీలోనే ఉండి ఉంటే బాగుండేదని ఎంపీ మల్లు రవి అన్నారు. జీవన్ రెడ్డి పార్టీ విడిపోవడం చాలా బాధాకరమని, పార్టీలోనే ఉండి తనకు కావాల్సిన దాని గురించి అడిగి ఉండాల్సిందని అన్నారు. గొప్ప సిద్ధాంతాలున్న కాంగ్రెస్ పార్టీలో పని చేయడం గొప్ప విషయమని, కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగానే అందరికీ పదవులు రావడం లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు, తెలంగాణ ప్రజల అవసరాలకు అనుగుణంగానే సీఎం రేవంత్ రెడ్డి పాలన చేస్తున్నారని మల్లు రవి అన్నారు. రేవంత్ రెడ్డి మంచి ప్రజాదరణ ఉన్న నాయకుడని, గొప్ప వ్యూహకర్త అని ప్రశంసించారు. జీవన్ రెడ్డి లాంటి క్రమశిక్షణ గల నాయకులు పార్టీ వీడడం బాధాకరమని, ప్రభుత్వం చక్కని పాలన అందించాలంటే కొంత సర్దుకు పోవాలని సూచించారు. తాను కూడా గతంలో చాలా అవకాశాలు కోల్పోయానని, అయినా పార్టీలోనే ఉండి పోరాటం చేశానని చెప్పారు. జీవన్ రెడ్డి మనసు మార్చుకొని పార్టీలో కొనసాగాలని, పరిస్థితులను బట్టి నాయకులకు అవకాశాలు వస్తాయని అన్నారు. మంచి నాయకులకు మంచి అవకాశాలు తప్పకుండా వస్తాయన్నారు.

డీలిమిటేషన్‌తో నరగంలో సీట్లు పెరుగుతాయి

అది బిఆర్ఎస్‌కు లాభిస్తుందన్న సుధీర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 25: డీలిమిటేషన్ జరిగితే గ్రేటర్ హైదరాబాద్‌లో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరిగే అవకాశముందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఇది తమకు లాభిస్తుందని అన్నారు. నగరంలో బిఆర్ఎస్ బలంగా ఉండడం వల్ల రానున్న ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామని అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా పలు రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. టీడీపీ పార్టీ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పడినప్పటికీ, ప్రస్తుతం అదే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం రాజకీయాల్లో సాధారణమైందని సుధీర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. అలాగే, సర్ నిర్వహించడం మంచిదేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాను సమగ్రంగా నవీకరించడం అవసరమని చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఓటింగ్ శాతం తగ్గిపోవడంపై కూడా ఆయన స్పందించారు. ఐదేళ్ల పాటు నగరంలో నివసించే ఓటర్లు, ఓటింగ్ రోజు తమ స్వగ్రామాలకు వెళ్లడం వల్ల గ్రేటర్‌లో పోలింగ్ శాతం తగ్గుతోందని ఆయన తెలిపారు.

పెద్ద ఎత్తున గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి

సోలార్ పవర్ పై డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, మార్చి 25: గ్రీన్ ఎనర్జీని రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలన్న ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం పరిశీలన చేస్తుందని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో గృహ ఉపయోగ, వ్యవసాయ రంగానికి సంబంధించి 81 గ్రామాల్లో ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద సోలార్ విద్యుత్ ఉత్పత్తి పక్రియను చేపడుతుందని తెలిపారు . ఈ కార్యక్రమంలో భాగంగా 38,216 గ్రామాలు మరియు 16,078 వ్యవసాయ పంప్ సెట్ లకు సోలార్ ఎ÷-లాంట్స్ ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. గృహ ఉపయోగ రూఫ్ టాప్ సోలార్ కింద పీఎం సూర్యగర్ ప్రభుత్వ బిజిలీ కింద 40, 349 గృహాల్లో టు కే సామర్థ్యం రూట్ ఆఫ్ సోలార్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు వ్యవసాయ సేవలు కింద పీఎం కుసుమ్ కాంపోనెంట్ సి కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా 16,708 వ్యవసాయ సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

నగరంలో ఒక్క ఇంటినైనా నిర్మించారా

అసెంబ్లీలో తలసాని ప్రశ్న

హైదరాబాద్, మార్చి 25: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 28 నెలలు గడుస్తున్నా హైదరాబాద్ నగరంలో ఒక ఇంటినైనా నిర్మించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని నిలదీశారు. బుధవారం అసెంబ్లీలె ఇందిరమ్మ ఇళ్లపై చర్చలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కార్యక్రమంతో పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. 2.31 లక్షల ఇండ్లను మంజూరు చేసి 1.62 లక్షల ఇండ్లను నిర్మించామని, జంటనగరాల పరిధిలో 65 వేల ఇండ్లను లాటరీ విధానంలో పారదర్శకంగా లబ్దిదారులకు కేటాయించామని వెల్లడించారు. సనత్ నగర్ లోని ఐడీహెచ్ కాలనీలోనే మొట్టమొదట డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. నాటి గవర్నర్ నరసింహన్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను చూసి గొప్పగా అభినందించారని గుర్తు చేశారు.జంట నగరాలలోని బస్తీలలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్థానికంగా 70 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న అర్హులైన పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంపై విమర్శలు చేస్తున్న వారు తనతో వస్తే బీఆర్ఎస్ హయాంలో ఎంత గొప్పగా నిర్మించామో చూపిస్తామని సవాల్ విసిరారు.

అమ్రాబాద్ గిరిజనులకు పూర్తి అండ

- వారికి ప్రత్యామ్నాయ కాలనీ నిర్మాణం
- ఒక్కో కుటుంబానికి 15లక్షల పరిహారం
- నగదు అందచేసిన డిప్యూటి సిఎం భట్టి

హైదరాబాద్, మార్చి 25: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో నివసిస్తున్న గిరిజనుల పునరావాసానికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గిరిజనుల అభీష్టం మేరకే పునరావాసం చేపడుతున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొదటి దశలో నాలుగు గ్రామాలకు చెందిన 417 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అసెంబ్లీ కౌన్సిల్ హాల్‌లో 14 గిరిజన కుటుంబాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా 160 కుటుంబాలకు నగదు పరిహారం ఇవ్వగా, 257 కుటుంబాలకు ఇల్లు, 5 ఎకరాల భూమిని కేటాయిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బచారం వద్ద ఆధునిక సదుపాయాలతో పునరావాస కాలనీని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం మొత్తం రూ.62.55 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. పునరావాసం తర్వాత గిరిజన కుటుంబాలకు పక్కా ఇళ్లు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. గిరిజన పిల్లలకు ఆధునిక పాఠశాలలు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు కూడా కల్పించనున్నారు. దేశంలోనే అత్యధిక పరిహారాల్లో ఒకటిగా భావిస్తున్న రూ.15 లక్షల ప్యాకేజ్ ద్వారా గిరిజనులకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా, ఈ పునరావాసం ద్వారా సుమారు 1501 హెక్టార్ల అటవీ భూమి పునరుద్ధరణకు అవకాశం లభించనుంది. పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు ఇది కీలకంగా మారనుంది. బచారం పునరావాస కాలనీని మోడల్ గ్రామంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ఇప్పసారాపై సభలో గందరగోళం

- బిజెపి ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రుల ఆగ్రహం

హైదరాబాద్,మార్చి 25 : బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా శాసనసభలో గందరగోళం నెలకొంది. భాజపా ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పపువ్వు సారా అంశంపై శాసనసభలో చర్చ జరిగింది. సారా పథకానికి మాత్రం ఇందిరమ్మ పేరు పెట్టొద్దంటూ భాజపా ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్ప సారాకు ఇప్ప టకీలా లేదా.. మరేదైనా పేరు పెట్టుకోవాలని అన్నారు. దీన్ని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తప్పుబట్టారు. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ తెలిపారు. దివంగత మహిళా ప్రధానిని భాజపా ఎమ్మెల్యే అవమానించారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. భాజపా నేతలు ఇందిరమ్మ మీద ఇంకా అక్కసు ప్రదర్శిస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఇందిరాను అవమానించడమంటే మహిళా సమాజాన్ని అవమానించినట్లే అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇందిరా గాంధీని వాజ్‌పేయీ ఉక్కు మహిళ, దుర్గా మాతా అని గతంలో అన్నారని గుర్తుచేశారు. అనంతరం తన వ్యాఖ్యలపై రాకేశ్‌రెడ్డి వివ రణ ఇచ్చారు. ఇందిరా గాంధీపై గౌరవం తోనే ఆ పేరు పెట్టవద్దని చెప్పానన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఇప్ప సారా తయారీ కేంద్రం ఉండాలని సూచించానన్నారు.ప్రతిపథకానికి ఇందిరమ్మ పేరు పెట్టడం కాంగ్రెస్ వాళ్లకు అలవాటు. ఇప్పసారా పథకానికి మాత్రం దయచేసి ఆ పేరు పెట్టవద్దని సూచించాను. నేను చేసిన సూచనలోఎలాంటితప్పు లేదు. ఇంది రాగాంధీ ఉక్కు మహిళ.. ఆమె అంటే నాకు ఎంతో గౌరవం. ఆమె కాంగ్రెస్ నేత మాత్ర మే కాదు..భారతమాజీప్రధాని అని చెప్పారు.

ఆశావర్కర్ల జీతాలపై హామీ మరిచారా?

- అసెంబ్లీలో ప్రశ్నించిన హరీష్ రావు

హైదరాబాదం,మార్చి 25 : ఎన్నికల సందర్భంగా ఓట్లు దండుకోవడం కోసం అలవిమాలిన హామీలు ఇచ్చి ఇప్పుడు మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీష్‌రావు మండిప డ్డారు. అసెంబ్లీ వేదికగా సర్కారుపై నిప్పులు చెరిగారు. ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నాడు తన ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్నదని ఆయన గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ తన మానిఫె స్టోలో పేర్కొన్న మేరకు ఆశా వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం ఎప్పటి నుంచి ఇస్తుందని ప్రశ్నించారు. గత వారం రోజులు గా ఆశా వర్కర్లు ధర్నా చేస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం వారికి రూ.18 వేల కనీస వేతనం ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్ కిట్‌ను కూడా బంద్ చేశారని విమర్శించారు. దాంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీలు 20 శాతం తగ్గాయని చెప్పారు. దీనిపై ప్రభుత్వ చర్యలు ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్‌ను ఎప్పటి నుంచి తిరిగి ప్రారంభిస్తారో చెప్పాలని నిలదీశారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఖాళీ చేయండి

- అక్బర్ రోడ్డు కార్యాలయం ఖాళీకి నోటీసులు

న్యూఢిల్లీ,మార్చి25 : దేశ రాజధానిలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి అధికారులు నోటీసు అందించారు. ల్యుటియన్స్ జోన్ ఖాళీ చేయాలని అక్బర్ రోడ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిట్ నోటీసు ఇచ్చారు. అలాగే 5వ నెంబర్ రైసినా రోడ్‌లోని యూత్ కాంగ్రెస్ ఆఫీస్‌ని కూడా ఖాళీ చేయాలని ఆదేశించారు. మార్చి 28లోపు రెండు ప్రాంగణాలను ఖాళీ చేయాలని డెడ్‌లైన్ విధించారు అధికారులు. 1978 నుంచి అంటే దాదాపు 48 ఏళ్ల నుంచి అక్బర్ రోడ్‌లోని ప్రధాన కార్యాలయం కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను కాంగ్రెస్ నిర్వహిస్తోంది. అయితే, బలవంతపు తొలగింపును అడ్డుకునేందుకు న్యాయపరమైన మార్గాలను పరిశీంచి కోర్టును ఆశ్రయించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, గతేడాది కోట్లా మార్గ్‌లో తమ కొత్త ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. అయినప్పటికీ అక్బర్ రోడ్ ప్రాంగణాన్ని ఇంకా ఖాళీ చేయలేదు. పార్టీ కార్యకలాపాలు అక్కడే కొనసాగుతున్నాయి. అక్బర్ రోడ్ కార్యాలయంతో తమకు ఎంతో భావోద్వేగ బంధం ఉందని పలువురు పార్టీ సీనియర్లు చెబుతున్నారు. ఈ భవనానికి చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ పాలనలో వైస్రాయ్ లార్డ్ లిన్లిత్‌గో కార్యనిర్వాహక మండలి సభ్యుడైన సర్ రెజినాల్డ్ మాక్స్‌వెల్ ఇక్కడే నివసించారు. 1960ల ప్రారంభంలో భారతదేశంలో మయన్మార్ రాయబారి అయిన డా.ఖిన్ కీ నివాసంగా ఉండేది. ఆ తర్వాత నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న డా.ఖిన్ కీ కుమార్తె ఆంగ్ సాన్ సూకీ చాలా సంవత్సరాలు అక్కడే నివాసం ఉన్నారు. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం చెందింది. దీంతో పార్టీ చీలిపోయే పరిస్థితులు వచ్చాయి. ఇందిరాగాంధీ వర్గానికి పార్టీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఓ భవనం కావాల్సి వచ్చింది. ఇందిరా గాంధీకి విధేయుడైన అప్పటి రాజ్యసభ ఎంపీ జి.వెంకటస్వామి అక్బర్ రోడ్‌లోని తన బంగ్లాను ఇచ్చారు. ఇక, అప్పటి నుంచి కాంగ్రెస్ తరఫున ప్రధానమంత్రులైన రాజీవ్ గాంధీ, పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్ సహా అందరూ దీన్ని ప్రధాన కార్యాలయంగా కొనసాగించారు.

యూపిలో రెండ్రోజులు శ్రీరామనవమి సెలవులు

యోగి సర్కార్ ప్రకటన

లక్నోమార్చి25 : శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఉత్తరప్రదేశ్ లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 26, 27 తేదీలను సెలవు దినాలుగా ప్రకటించింది. పండుగ సందర్భంగా ఆలయాలను సందర్శించే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మతపరమైన మనోభావాలను గౌరవిస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు యోగి ఆదిత్యనాథ్ రెండ్రోజుల సెలవుదినాల నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. తద్వారా రామనవమి ఉత్సవాల్లో పాల్గొనే ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పించడం జరుగుతుందని పేర్కొన్నాయి. శ్రీరామనవమి వేడుకల నేపథ్యంలో అధికారులు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. యూపీలోని ప్రధాన ఆలయాలను సందర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఏటా తరలివస్తుంటారు. అయోధ్యతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఊరేగింపులు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన మార్గదర్శకాలను పోలీసులు, ప్రభుత్వాధికారులు ఇప్పటికే విడుదల చేశారు. అయోధ్య, వారణాసి, మథుర సహా ఇతర ప్రధాన నగరాల్లో ఇప్పటికే పండుగ వాతావరణం నెలకొంది.

రష్యా నుంచి భారీగా క్రూడాయిల్ కొనుగోళ్లు

60 మిలియన్ బ్యారెళ్లు సేకరించినట్లు ప్రచారం

న్యూఢిల్లీ,మార్చి25: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురుకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. బ్రెంట్ క్రూడాయిల్ ధర భారీగా పెరిగింది. దేశంలో ఇంధన సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. రష్యా నుంచి భారీగా ముడి చమురును కొనుగోలు చేస్తోంది. తాజాగా రష్యా నుంచి 60 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును భారత రిఫైనరీలు కొనుగోలు చేసినట్టు 'బ్లూమ్‌బర్గ్' తన కథనంలో పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లోని బ్రెంట్ క్రూడాయిల్ ధర కంటే, బ్యారెల్‌కు 5-15 డాలర్లు అధికంగా చెల్లించి మరీ భారత రిఫైనరీలు ఈ కొనుగోళ్లు జరిపినట్టు సమాచారం. ఫిబ్రవరిలో రష్యా నుంచి కొనుగోలు చేసిన ముడి చమురుతో పోల్చుకుంటే ఈ కొనుగోళ్లు దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసి ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగించిన నేపథ్యంలో.. రష్యా క్రూడాయిల్‌పై అమెరికా ఆంక్షలు సడలించింది. దీంతోనే భారత్ ర్గి÷నైరీలు ఇంత భారీ స్థాయిలో కొనుగోళ్లు జరిపాయి. హోర్ముజ్ జలసంధి దగ్గర నౌకల ప్రయాణానికి అంతరాయం కొనసాగినంత కాలం రష్యా ముడి చమురుపై ఆంక్షల సడలింపును అమెరికా పొడిగించే అవకాశం కనిపిస్తోందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న ఇరాన్ చమురుపై కూడా ఆమెరికా ఆంక్షలు ఎత్తేసింది. ఆ చమురును కూడా భారత రిఫైనరీలు కొనుగోలు చేసినట్టు వార్తలు వచ్చాయి.

పెట్రోల్, డీజిల్, గ్యాస్ కోసం ప్రజల ఆందోళన

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్న వివేకానంద

హైదరాబాద్, మార్చి 25: పెట్రోల్, డీజీల్, గ్యాస్ అవసరాలకు అనుగుణంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ప్రజలకు సరైన భరోసా ఇవ్వడం లేదని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేపీ వివేకానంద మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా స్టాక్స్ పెట్టుకుని ఉంటే ప్రజలు ఇబ్బంది పడాల్సిన అవ సరం ఉండేది కాదని స్పష్టం చేశారు. యూరియా కొరతతో రైతులు ఎలా ఇబ్బంది పడ్డారో ఇన్ని రోజులు చూశాం.. ఇప్పుడు ఇంధన కొరతను చూస్తున్నామని కేపీ వివేకానంద తెలిపారు. ఇంధన నిల్వలపై కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసుకోవడం లేదని విమర్శించారు. యుద్ధం జరుగుతున్న దేశాల్లో ఇబ్బంది లేదు కానీ.. యుద్ధం లేని దేశాలు మాత్రం ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. ఇంధన కొరతను ఊహించలేకపోవడం వల్లే ఇప్పుడు ఈ సమస్యను ఎదుర్కొంటున్నామని అన్నారు. పెట్రోల్, డీజిల్ గ్యాస్ లేకపోతే పొద్దుగడవదని కేపీ వివేకానంద అన్నారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఒకరిపై మరొకరు నెపం మోపుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఈ సమస్యపరిష్కారానికికేంద్ర,రాష్ట్రప్రభుత్వాలుచొరవతీసుకోవాలని సూచించారు.

రామ్‌చరణ్ కోలుకున్నాడు: పెద్ది టీమ్

హైదరాబాద్,మార్చి 25 : 'పెద్ది' సినిమా సెట్స్‌లో రామ్‌చరణ్‌కు గాయపడటంపై టీమ్ స్పందించింది. ప్రస్తుతం ఆయన కోలుకున్నారని తెలిపింది. సెట్స్‌లో చరణ్ కుడి కంటికి స్వల్ప గాయమైందని, వెంటనే తగిన చికిత్స జరిగిందని పేర్కొంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిమానులకు సూచించింది. చరణ్ గాయం విషయంలో వస్తున్న రూమర్లను నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. గురువారం నుంచి చరణ్ మళ్లీ షూటింగ్‌లో పాల్గొంటారని తెలిపింది.

పెట్రోలు కొరత లేదు

పెరగడంతో కొన్ని పెట్రోలు బంకుల్లో తాత్కాలికంగా కొరత ఏర్పడుతోంది. ఇదే అదనుగా కొంతమంది కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ దందాకు పాల్పడే ప్రమాదం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వదంతులను నమ్మొద్దని ప్రజలకు విజ&ఝప్తి చేస్తున్నా' అని అన్నారు.

స్థిరంగానే భారత్ ఇంధన భద్రత

సంతృప్తికరంగా సమాధానాలి చ్చిందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని సమర్ధవంతగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి మద్దతుగా నిలబడతామని విపక్ష పార్టీలు హామీనిచ్చాయని చెప్పారు. 'ప్రస్తుత సంక్షోభ సమయంలో పరిస్థితికి అనుగుణంగా ప్రభుత్వం తీసుకునే చర్యలకు సమష్టిగా మద్దతు ఇస్తామని విపక్షాలు తెలిపాయి' అని రిజిజు వివరించారు. కాగా, దేశంలో ఇంధన భద్రత స్థిరంగా, దేశ ఇంధన అవసరాలకు సరిపడా ఉందని అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం పేర్కొన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. సరకు కోసం అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవడంతో పాటు వివిధ దేశాలతో సంప్రదింపులు సాగిస్తున్నామని, నిరంతరాయ ఇంధన సరఫరాకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు పేర్కొన్నాయి. ఎల్జీపీ లభ్యత, హోర్ముజ్ జలసంధి మీదుగా షిప్‌మెంట్‌పై సమావేశంలో విపక్షాల ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే పరిస్థితి అదుపులోనే ఉందని, మరో నాలుగైదు రోజుల్లో నాలుగు నౌకలు పోర్టుకు చేరుకుంటాయని ప్రభుత్వం తెలిపింది. ఎలాంటి ఇంధన కొరత లేదని, తగినన్ని నిల్వలు ఉన్నాయని వివరించింది. అఖిలపక్షానికి హాజరైన అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని, విపక్షాలతో ఏ సమయంలోనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపింది. దేశ ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విపక్షాలతో చర్చలకు తలుపులు తెరిచే ఉంటాయని రాజ్‌నాథ్ అఖిలపక్ష సమావేశంలో పేర్కొన్నారు. యుద్ధంతో తలెత్తిన పరిణామాలు, ఇంధన భద్రతపై ఆందోళనలు, ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లను విదేశాంగ కార్యదర్శి మిస్రీ అఖిల పక్ష నేతలకు వివరించారు. మొత్తం మీద.. పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని, దేశీయంగా ప్రజల ఆందోళనలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందనే సందేశాన్ని అఖిలపక్ష సమావేశం ఇచ్చింది.

దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

సుజాతా శర్మ తెలిపారు. ఈ మేరకు నోటిఫికేషన్ ఇచ్చామని, నిర్దిష్ట కాలపరిమితి లోపు దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ మౌలిక వసతుల అభివృద్ధి జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో ఘర్షణల నేపథ్యంలో ఎల్పీజీ, ఇంధనం కొరతపై ఆందోళనలను ప్రస్తావిస్తూ, ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు పాల్పడవద్దని కోరారు. రిఫైనరీలు గరిష్ట సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, ఏటా 26 కోట్ల టన్నుల రిఫైనరీ సామర్థ్యం మనకు ఉందని చెప్పారు. గత రెండు రోజులుగా రిటైల్ ఔట్‌లెట్‌లు, పెట్రోల్ బంకుల వద్ద పెద్దఎత్తున జనం క్యూలు కడుతుండటం తమ దృష్టికి వచ్చిందని, అయితే ఆందోళన అవసరం లేదని, దేశంలో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. పెట్రోల్, డిజిల్ ధరలు కూడా పెరగబోవడం లేదని వివరించారు. వలస కార్మికులకు ప్రాధాన్యతా క్రమంలో 5 కిలోల సిలెండర్లు అందిస్తామని సుజాతా శర్మ తెలిపారు. 26 రాష్ట్రాలకు 22,000 టన్నుల ఎల్పీజీ కేటాయించామన్నారు. మంగళవారంనాడు 30,000 ఐదు కేజీల సిలెండర్లు ఇచ్చామని చెప్పారు. బ్లాక్‌మార్కెటింగ్, అక్రమ నిల్వలకు కళ్కెం వేసేందుకు 2,700 దాడులు జరిపామని, 2,000 సిలెండర్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువు పెంపుపై వస్తున్న వార్తలు నిజం కాదనీ, గ్యాస్ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవనీ సుజాత శర్మ వివరించారు. కనెక్షన్‌తో సంబంధం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్‌కు 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు ఎప్పటిలాగానే కొనసాగుతుందని సుజాత శర్మ స్పష్టం చేశారు. ఇదిలావుంటే పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ కొరతను అధిగమించడం సహా గ్యాస్ పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పైప్డ్ న్యాచురల్ గ్యాస్(పీఎన్‌జీ) సరఫరా అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వెంటనే దానికి మారాలని ఆయా వినియోగదారులకు సూచించింది. లేనిపక్షంలో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్(ఎల్‌పీజీ) సరఫరాను నిలిపివేస్తామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులిచ్చింది. దేశంలో పీఎన్‌జీని ప్రోత్సహించే దిశగా ముందడుగు వేస్తున్న కేంద్రం.. ఈ మేరకు 3 నెలల గడువు నిర్దేశిస్తూ ఆదేశాలు జారీచేసింది. పీఎన్‌జీ సౌకర్యం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని ఎల్‌పీజీ సిలిండర్లను మౌలిక సదుపాయాలు లేని ఏరియాలకు మళ్లించడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది. పీఎన్‌జీకి మారడం వల్ల రీఫిల్ బుక్‌చేసే అవసరముండదు. దీంతోపాటు నిరంతర గ్యాస్ సరఫరా అందుబాటులో ఉంటుంది. అయితే.. పీఎన్‌జీ సరఫరాలో సాంకేతిక సమస్యలు, ఇంటికి పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వడం అసాధ్యమైన సందర్భంలో మాత్రమే ఎల్‌పీజీ సరఫరా కొనసాగుతుంది.కానీ.. దానికి పీఎన్‌జీ గ్యాస్ కంపెనీ నుంచి నిరభ్యంతర పత్రంతప్పనిసరి. మేరకు పీఎన్‌జీ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు పలు చర్యలు చేపట్టింది కేంద్రం. పైప్డ్ గ్యాస్ లైన్‌కు నిర్ణీత గడువులోగా అధికారులు అనుమతులు మంజూరు చేయాలి. నిర్దేశిరచిన ఫీజుకంటే ఎక్కువ వసూలు చేయకూడదు. హౌసింగ్ సొసైటీలు లేదా భూయజమానులు కూడా పైపులైన్ సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదు. అలాంటి సందర్భాలేమైనా తలెత్తితే ఆ ప్రాంతానికి ఎల్‌పీజీ సరఫరాను నిలిపివేయడం సహా సంబంధిత వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది ప్రభుత్వం. వీటి అమలును పర్యవేక్షించడం సహా సమ్మతిని నిర్ధారించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ బోర్డ్ నోడల్ అథారిటీకి బాధ్యతలు అప్పగించింది.

దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేయాలి

పేరుతో గంటల తరబడి వాయిదాలు వేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి రావడం, మంత్రుల సంసిద్ధత వంటి కారణాలతో సభను తరచుగా వాయిదా వేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష గొంతును నొక్కుతున్నారని ఆరోపించిన హరీష్, అసెంబ్లీని మరో వారంరోజుల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, రైతులు సహా అన్ని వర్గాలను రేవంత్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. డీలిమిటేషన్ వల్ల బీఆర్ఎస్‌కు మేలు జరుగుతుందని, మహిళా రిజర్వేషన్లను తమ పార్టీ స్వాగతిస్తుందని తెలిపారు. కుటుంబ నియంత్రణను పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థిక, రాజకీయ నష్టం జరుగుతుందని కూడా ఆయన పేర్కొన్నారు. ఇక ఉద్యోగాల అంశంపై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని వ్యాఖ్యనించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 16,978 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, మొత్తం 16 నోటిఫికేషన్లు మాత్రమే విడుదల చేశారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను కూడా కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకుంటోందని ఆరోపించారు. సంక్షేమ బోర్డుల పరిస్థితిపై కూడా హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 33 సంక్షేమ బోర్డులు ఉన్నప్పటికీ, వాటిలో 16కి మాత్రమే కార్యాలయాలు ఉన్నాయని, మిగిలిన 17 బోర్డులకు కార్యాలయాలు కూడా లేవని తెలిపారు. కార్పోరేషన్లకు కేటాయించిన నిధుల్లో 99 శాతం లాప్స్ అవుతున్నాయని, కేవలం 2 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు.

మీరేమైనా రాజులా...ఎందుకీ నిర్లక్ష్యం

- గురుగ్రామ్ పోలీసుల తీరుపై మండిపడ్డ సుప్రీం
- చిన్నారిపై అత్యాచరం జరిగితే ఇంత నిర్లక్ష్యమా
- క్రాస్ ఎగ్జామిన్ పేరుతో వేధింపులు చేస్తారా
- కనీసం కేసు కూడా పెట్టకుండా ఏం చేస్తున్నారు
- చిన్నారిని పిలిచి పదేపదే ప్రశ్నించడం ఎంత దారుణం
- మీరే ఎందు వారి ఇంటికి వెళ్లలేక పోయారు
- వెంటనే పోలీసులపై చర్యలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ,మార్చి25 : నాలుగేళ్ల బాలికపై జరిగిన అత్యాచారం కేసులో గురుగ్రామ్ పోలీసులు స్పందించిన తీరును సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుపట్టింది. ఆ చిన్నారితో పాటు వారి తల్లిదండ్రులతో అధికారులు ప్రవర్తించిన తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మండిపడింది. బాలికను క్రాస్-ఎగ్జామినేషన్ చేసిన అధికారులను మందలిస్తూ.. ఈ చర్యలు ఆ బాలికను మరింత మానసిక వేదనకు గురిచేయడం సహా అగౌరవపరిచాయని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమ కూతురిపై అత్యాచారం జరిగిందని గురుగ్రామ్ పోలీసులకు ఫిర్యాదు చేసినా.. వారు చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ తల్లిదండ్రులు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. నిందితుడి సమక్షంలో మేజిస్ట్రేట్.. ఆ బాలికను ఎలా ప్రశ్నించారనే దానిపై పోలీసులు, జిల్లా న్యాయవ్యవస్థ వివరణ ఇవ్వాలని కోరింది. 'పోలీసులు బాధితురాలి ఇంటికి ఎందుకు వెళ్లలేరు? వాళ్లేమైనా రాజులా?' అని ఈ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు. ఈ కేసులో హరియాణా తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. చిన్నారులపై లైంగిక నేరాల నుంచి రక్షణ(పోక్సో) చట్టంలోని సెక్షన్ 6(నేరం రుజువైతే 20ఏళ్ల జైలుశిక్ష) నుంచి నేరాన్ని సెక్షన్ 10(పదేళ్ల జైలుశిక్ష)కి ఎందుకు కుదించారని ధర్మాసనం నిలదీసింది. బాలల సంక్షేమ కమిటీ నివేదిక ఆధారంగా అభియోగాలను మార్చినట్టు భాటి సమాధానమివ్వగా.. బాలిక వాంగ్మూలం కంటే ఆ నివేదికకు ఎందుకు ప్రాధాన్యమిచ్చారని ప్రశ్నిస్తూ.. అసమర్థమైన విషయాన్ని సమర్థించవద్దని ఆగ్రహం వ్యక్తం చేసింది. డీసీపీ, ఏసీపీ హోదా కలిగిన పోలీస్ అధికారులు ఈ విచారణలో భాగమయ్యారు. ఆ చిన్నారిపై జరిగిన నేరం గురించి వారి అవగాహన ఇదే అయితే, మరి చట్టబద్ధమైన పాలన సంగతేంటి? అత్యాచారం అంటే లైంగిక చొరబాటు మాత్రమే కాదు. ఈ విషయంలో పోలీసులకు స్పష్టమైన అవగాహన లేకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. నేర తీవ్రతను తగ్గించేందుకే అత్యున్నత పోలీస్ అధికారులను రంగంలోకి దించారు' అని జస్టిస్ బాగ్చి అన్నారు. పోలీసులు కనీసం చట్టాన్ని చదవలేదు. నాలుగేళ్ల చిన్నారి నిర్దోషిత్వాన్ని నమ్మలేదు. వారికి సిగ్గుండాలి. రాష్ట్రానికి చట్టంపై ఏమాత్రం గౌరవం ఉన్నా, వారిని తక్షణమే బదిలీ చేయాలి. సీసీటీవీ కెమెరాలు లేవని చెబుతున్నారు. 15 రోజులుగా ఏమీ చేయకుండా.. మేమీ కేసును పరిగణనలోకి తీసుకున్నాకే అరెస్ట్‌లు మొదలెట్టారు. మీరెందుకంత తీరిక లేకుండా ఉన్నారో మేమే చెప్పాలా? ఈ కేసు సున్నితత్వం లేమికి పరాకాష్టగా నిలుస్తోంది. సీడబ్ల్యూసీ సభ్యులు ఎవరు? వారిని ఎవరు నియమిస్తారు? వారి అర్హతలేమిటి?' అని సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నలవర్షం కురిపించారు. ఈ కేసు నమోదులో భాగంగా అఫిడవిట్‌లో పలుమార్లు ఆ చిన్నారి పేరు ప్రస్తావించడంపైనా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. గురుగ్రామ్ పోలీసులు నిర్లక్ష్యపూరితమైన, బాధ్యతారహితమైన, పూర్తిగా చట్టవిరుద్ధమైన దర్యాప్తు విధానాన్ని కొనసాగించారని.. ఈ తీరుతో ఆ చిన్నారి మరింత మానసిక క్షోభకు గురై ఉంటుందని అభిప్రాయపడింది.

పెదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- అసంపూర్తిగా ఉన్నవాటిని పూర్తి చేస్తాం
- స్వాధీనం చేసుకోని ఇళ్లకు కొత్తవారికి కేటాయిస్తాం
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో చర్చలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మార్చి 25: గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 21 లక్షల ఇళ్లు నిర్మించారని తెలిపారు. శాసనసభలో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లకు అనుమ తులు ఇచ్చిందని చెప్పారు. అయితే, ఆ ఇళ్లలో అనేక పనులు పూర్తి కాలేదని మంత్రి వెల్లడించారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నా యని, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ఈ అసంపూర్తి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. ఇక గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో 12 వేల ఇళ్లను ఇప్పటికీ లబ్దిదారులు స్వాధీనం చేసుకోలేదని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్దిదా రులకు మూడు నెలల గడువు ఇచ్చి నోటీసు లు జారీ చేయగా, అందులో 6 వేల మంది ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్దిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, పూర్తి కాకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎంత ఖర్చు అయినా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా త్వరలో లబ్దిదారులకు అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో హైదరాబాద్‌లో సమీక్ష సమా వేశం నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 99 రోజుల ప్రణాళికలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు కేటాయిస్తామని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎన్ని ఉన్నాయి? వాటిలో ఎన్ని పూర్తయ్యాయి? ఇంకా ఎన్ని పూర్తి కావాల్సి ఉందనే దానిపై తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఎమ్మెల్యే కె. వెంకటరమణా రెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఇందిరమ్మ ఇల్లు మంచి పథకమన్నారు. వీటి వల్ల పేదలకు లబ్ది జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కట్టిన డబుల్ బెడ్ రూం ఇల్లు నాసిరకంగా ఉండడంతో శిథిలావస్థకు చేరాయని విమర్శించారు. ఇప్పటికే పూర్తయి ఎవరికి కేటాయించని డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి జోక్యం లేకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. ఇప్పటికే పూర్తయి.. ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వీలైనంత త్వరగా లబ్దిదారులకు అందజేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఖైరతాబాద్‌లో 5 ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టేందుకు శంకుస్థాపన చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించిందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గుర్తు చేశారు. చిన్న చిన్న రిపేర్ల కారణంగా వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇంకా లబ్దిదారులకు అందజేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పార్టీని దృష్టిలో పెట్టు కుని డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీలు చెప్పే వారికే ఇళ్లు ఇస్తామంటున్నారని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. అల్లుడు వస్తే ఏడుంటడు, బిడ్డ వస్తే ఏడుంటడు అని గతంలో మాట్లాడిన కేసీఆర్.. గత పదేళ్ళలో అసలైన పేదలకు ఇళ్లు ఇవ్వలేదని బీఆర్ఎస్ అధినేతపై ఎమ్మెల్యే వంశీ కృష్ణ మండి పడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లకు సైతం కాలం చెల్లడంతో అవి శిథిలావస్థకు చేరాయని పేర్కొన్నారు. వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వా నికి సూచించారు. జాయింట్ ఫ్యామిలీని రీ ఎంక్వరీ చేసి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిం చాలని ప్రభుత్వానికి ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు బ్జడెట్‌లో రూ. 5 వేల కోట్లు కేటాయించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇంకా పూర్తి కాని వాటికే ఈ రూ.5 వేల కోట్లు సరిపోవని చెప్పారు. వచ్చే ఏడాది కేటాయించిన ఇళ్లకు నిధులు ఎలా ఇస్తారంటూ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇంతలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని.. పల్లా రాజేశ్వర్ రెడ్డి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. నియోజక వర్గానికి నాలుగున్నర లక్షల ఇళ్లు అన్ని పల్లా మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నియోజకవర్గానికి అన్ని ఇళ్లు ఉంటాయా అంటూ సందేహం వ్యక్తం చేశారు. సభను పక్కదారి పట్టించడమే ఏజెండాగా పెట్టుకున్నారని పల్లాపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. పేదల కోసం పెట్టిన బ్జడెట్‌ను బీఆర్ఎస్ విమర్శిస్తుందా? అం టూ సందేహం వ్యక్తం చేశారు. బడ్జెట్ పుస్తకాల ను చించి పేదలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అవమానించారంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిప్పులు చెరిగారు.

సిరిసిల్ల నేతన్నలను కాపాడండి

విద్యుత్ బాకాయిలు మాఫీ చేయండి

డిప్యూటి సిఎం భట్టికి కెటిఆర్ వినతి



హైదరాబాద్,మార్చి25 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను చుట్టుముట్టిన విద్యుత్ సంక్షోభం నుంచి నేతన్నలను కాపాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిరిసిల్ల పవర్‌లూమ్ యూనిట్లపై ఉన్న విద్యుత్ బకాయిలు, సర్‌చార్జిల భారంపై తుమ్మలకు సమగ్రమైన వినతి పత్రాన్ని అందజేసి, వాటిని మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రిని కలిసి ఒక లేఖను అందజేశారు.సిరిసిల్ల పట్టణం రాష్ట్ర వస్త్ర పరిశ్రమకు గుండెకాయ వంటిదని, గతంలో ఇక్కడ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడిన చేదు జ్ఞాపకాలను కేటీఆర్ ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో 25 హెచ్.పి. వరకు విద్యుత్ సబ్సిడీ పెంచడం వల్ల పరిశ్రమ నిలదొక్కుకుందని, అయితే ప్రస్తుతం విద్యుత్ అధికారులు విధిస్తున్న 'బ్యాక్ బిల్లింగ్' భారం వల్ల వేలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆయన వివరించారు. 2016 నుంచి 2024 వరకు ఉన్న కాలానికి సంబంధించి సుమారు 127 ఎస్.ఎస్.ఐ యూనిట్లపై అధికారులు రూ. 19 కోట్ల బ్యాక్ బిల్లింగ్ భారం మోపారని, అది సర్‌చార్జిలతో కలిపి ఇప్పుడు రూ. 38 కోట్లకు చేరిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ భారీ బకాయిలను చెల్లించలేక అనేక యూనిట్లు మూతపడటంతో పాటు, ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులతో 13 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లుల భారాన్ని మానవీయ కోణంలో రద్దు చేసి నేతన్నను అదుకోవాలన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను, కార్మికుల ఉపాధిని రక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కేటీఆర్ కోరుతూ కింద పేర్కొన్న అంశాలపై విజ్ఞప్తి చేశారు:? సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న బ్యాక్ బిల్లింగ్ మరియు సర్‌చార్జి మొత్తాలను పూర్తిగా మాఫీ చేయాలి. పాత బకాయిలతో సంబంధం లేకుండా, పరిశ్రమకు నిరంతరాయంగా విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా ఆదేశాలుఇవ్వాలి.కార్మికులు మళ్లీ ఆత్మహత్యల బాట పట్టకుండా తక్షణ ఆర్థిక వెసులుబాటు కల్పించాలి. సిరిసిల్ల నేతన్నల సమస్య కేవలం ఒక ప్రాంతానిది కాదని, అది వేలాది కుటుంబాల మనుగడకు సంబంధించినదని కేటీఆర్ గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి గారు సానుకూలంగా స్పందించి, త్వరితగతిన ఈ సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.కెటిఆర్ గారితోపాటు ఏంఏల్సీ ఎల్ రమణ గారు కూడా ఉన్నారు

ఉగ్ర లింకుల కేసులో మరొకరి అరెస్ట్

- హైదరాబాద్ పాతబస్తీ మహిళ విజయవాడకు తరలింపు

హైదరాబాద్,మార్చి 25 : తెలుగు రాష్ట్రాల్లో ఉగ్ర లింకులు కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే విజయవాడలో ముగ్గురు యువకులను అరెస్టు చేయగా.. తాజాగా వారిని ఉగ్రవాదం వైపు ప్రోత్సహించిన హైదరాబాద్‌కు చెందిన యువతిని కూడా అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ చంచల్‌గూడకు చెందిన సయిదా బేగంను కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విచారణ నిమిత్తం ఆమెను విజయవాడకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విదేశీ హ్యాండ్లర్ అల్ హకీమ్ షుకూర్ సూచనలతో సయిదా బేగం పనిచేస్తుంది. ఈ క్రమంలోనే విజయవాడకు చెందని సోహైల్ బెగ్, షరీఫ్, డానిష్ యువకులను తీవ్రవాద సంస్థల వైపు మళ్లించడంలో ఆమె కీలక పాత్ర పోషించిందని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్ మల్లేపల్లి ప్రాంతానికి చెందిన మరో వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

తల్లిని చంపి ఇంట్లోనే పూడ్చిన కూతురు

పోలీసుల దర్యాప్తులో అంగీకిరించన నిందితురాలు

హైదరాబాద్,మార్చి25:నగరంలో దారుణం చోటుచేసుకుంది. ప్రేమ వ్యవహారానికిఅడ్డుపడిందని తల్లిని ప్రియుడి సాయంతో కుమార్తె చంపేసింది.ఈ ఘటన నగరంలోని జవహర్‌నగర్ పరిధి కౌకూర్ భరత్‌నగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 10 నెలల క్రితం అంజుఅనే మహిళఅదృశ్యమైంది. దీనిపై జవహర్‌నగర్ పీఎస్‌లో పెద్దకుమార్తె ఫిర్యాదు చేసింది. కుటుంబసభ్యుల ఫోన్‌కాల్స్‌ను పోలీసులు విశ్లేషించడంతో పాటు స్థానికులను విచారించారు. ఈ క్ర మంలో తల్లిని చంపినట్లు చిన్న కుమార్తె ఇషిక అంగీకరించింది. ప్రియు డు మౌంటీరాజ్‌తో కలిసి ఈ హత్య చేసినట్లు వెల్లడించింది. ప్రియుడితో సహజీవనంపై తల్లి మందలించడంతో ఆమెను చంపి ఇంట్లోనే పూడ్చిపెట్టినట్లు తెలిపింది. దీంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కాంగ్రెస్ పార్టీవి డైవర్షన్ పాలిటిక్స్

- ఫార్ములా రేస్ కేసు పెట్టిందే అందుకు
- పునరుద్ఘాటించిన బిఆర్ఎస్ నేత కెటిఆర్

హై

పంచాయతీరాజ్ రోడ్లకు నిధులు విడుదల చేస్తాం..

- ఎమ్మెల్యే కవ్వంపల్లికి మంత్రి సీతక్క హామీ

బలగం టీవీ, మానకొండూర్:

మానకొండూర్ నియోజకవర్గం పరిధిలో చేపట్టిన పంచాయతీ రాజ్ రోడ్లకు సత్వరమే నిధులు విడుదల చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చెప్పారు. బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో ఆరు మండలాలకు చెందిన సర్పంచులు, పార్టీ నాయకులు అసెంబ్లీలోని చాంబర్ లో వినతిపత్రం అందజేయగా, ఈ మేరకు ఆమె వారికి హామీ ఇచ్చారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి నిధులు విడుదల చేయడమే కాకుండా భవిష్యత్తులు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయిస్తామన్నారు.మానకొండూర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో సుమారు 30.44 కోట్ల రూపాయల విలువ చేసే పనులకు చేపట్టడం జరిగిందని, అయితే నిధులు విడుదల కాకపోవడం వల్ల పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయని, దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారని, వెంటనే ఆ నిధులు విడుదల చేయాలని మంత్రిని వారు కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క నిధుల విడుదలకు హామీ ఇచ్చారు.

గన్నేరువరం మండల పరిషత్ భవన నిర్మాణానికి హామీ..

నూతనంగా ఏర్పాటైన గన్నేరువరం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి మంత్రి సీతక్క హామ ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయాన్ని కొనసాగిస్తున్న అద్దె భవనంలో సౌకర్యాలు లేక ఇక్కట్లు గురవుతున్నామని మంత్రి దృష్టికి తీసుకు రాగా, ఆమె సానుకూలంగా స్పందిస్తూ గన్నేరువరం మండల పరిషత్ కార్యాలయానికి త్వరలోనే నూతన కార్యాలయం నిర్మిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

పచ్చునూరు మండలం ఏర్పాటును పరిశీలిస్తాం..

పచ్చునూరును మండలంగా ఏర్పాటు చేయాలని ఆ మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి సీతక్కను కోరారు. మానకొండూర్ మండలం పరిధిలోని పచ్చునూరు గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని చాలా ఏళ్లుగా ప్రభుత్వాలను కోరుతూనే ఉన్నామని, ఇప్పటికైనా పచ్చునూరును మండలంగా ఏర్పాటు చేయాలని, నూతనంగా ఏర్పాటు చేయనున్న మండలాల జాబితాలో పచ్చునూరు కూడా చోటు కల్పించాలని వారు కోరగా, మంత్రి పచ్చునూరును మండలంగా ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని చెప్పారు.

మంత్రి సీతక్కను కలిసిన బృందంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, ఇల్లంతకుంట, బెజ్జంకి, గన్నేరువరం, మానకొండూర్ మండలాల పార్టీ అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, ముక్కిస రత్నాకర్ రెడ్డి, ముస్కు ఉపేందర్ రెడ్డి, నందగిరి రవీంద్రచారి, మాజీ ఎంపీపీలు ఊట్కూరి వెంకట రమణారెడ్డి, గుడిసె అయిలయ్య,శ్రీగిరి రంగారావు, పార్టీ నాయకులు ఆకుల సత్యం, ద్యాప శ్రీనివాస్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, మన్మోహన్ రావు, ఆర్.తిరుమల్ రెడ్డి, గొల్లెన కొమురయ్య,బుర్ర శ్రీధర్, రెడ్డిగాని రాజు, మాతంగి అనిల్, ఆర్.రాజమల్లయ్య తదితరులు ఉన్నారు.

ఇంధన కొరత లేదు - పుకార్లను నమ్మవద్దు

- 60 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి..
- అనవసరంగా ఫుల్ ట్యాంకులు చేయించవద్దు..
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు..
- సీపీ వీసీ సజ్జనర్

బలగం టీవీ, హైదరాబాద్:

హైదరాబాద్ నగరంలో ఇంధన కొరత ఉందంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ స్పష్టం చేశారు. నగరంలో దాదాపు 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన వెల్లడించారు. ఇంధన సరఫరాపై తలెత్తిన అపోహల నేపథ్యంలో బుధవారం టీజీసీసీసీలో జిల్లా కలెక్టర్ శ్రీమతి హరిచందన, ఐఏఎస్, అదనపు సీపీ తప్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, జాయింట్ సీపీ శ్రీమతి శ్వేత, ఐపీఎస్ మరియు సివిల్ సప్లై అధికారులతో కలిసి ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ.. ఆయిల్ కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, నగరవ్యాప్తంగా సరఫరా నిరాటంకంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు ఒక్కసారిగా పెట్రోల్ బంకులకు వచ్చి వాహనాలకు ఫుల్ ట్యాంకులు చేయించుకోవడం వల్ల ఆకస్మాత్తుగా డిమాండ్ పెరిగి, కొన్ని చోట్ల తాత్కాలికంగా నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయని, దీనిని కొరతగా భావించవద్దని కోరారు. తప్పుడు ప్రచారాల వల్ల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 22న 3,024 కిలోలీటర్ల ఇంధనం అమ్ముడవగా, 23న ఆ సంఖ్య రెట్టింపై 6,400 కిలోలీటర్లకు చేరుకుందని, జనం భయాందోళన చెందడం వల్లే అమ్మకాలు ఈ స్థాయిలో పెరిగాయని తెలిపారు. ముఖ్యంగా నిబంధనలకు విరుద్ధంగా బాటిళ్లు, డబ్బాల్లో లూజ్ పెట్రోల్ లేదా డీజిల్ విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేసే వారిపై నిఘా ఉంచామని, అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కమిషనరేట్ పరిధిలోని 240 పెట్రోల్ బంకుల్లో పరిస్థితిని సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు.

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ.. ఆయిల్ సంస్థలు, సివిల్ సప్లై అధికారులతో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, ప్రజల సౌకర్యార్థం ప్రత్యేకంగా కంట్రోల్ రూంను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లా పరిధిలోని 186 బంకుల్లో ఇంధన సరఫరా సజావుగా సాగుతోందని, ప్రజలు అనవసర ఆందోళనతో బంకుల వద్ద రద్దీ పెంచవద్దని కోరారు.

ప్రియుడి మోజులో కన్న తల్లిని హత్య చేసిన కూతురు

అంజు

నిందితురాలు ఇషికా

- ఇంట్లోనే మృతదేహం పాతిపెట్టి ఘటన దాచిపెట్టిన దారుణం
- అదృశ్య కేసును ఛేదించిన జవహర్‌నగర్ పోలీసులు

బలగం టీవీ, హైదరాబాద్:

ప్రియుడి మోజులో పడిన ఓ యువతి కన్న తల్లినే కిరాతకంగా హత్య చేసి ఇంట్లోనే పాతిపెట్టిన హృదయ విదారక ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ దారుణం జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూర్ భరత్‌నగర్‌లో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అంజు (40) అనే మహిళ తన ఇద్దరు కుమార్తెలతో కలిసి నివసిస్తోంది. పెద్ద కుమార్తె రిషికకు వివాహమై వేరుగా ఉంటుంది. చిన్న కుమార్తె ఇషికా ఇంటర్ చదువుతున్న సమయంలోనే 2023 డిసెంబర్‌లో మోంటీ కుమార్ సింగ్ అలియాస్ రాజ్‌తో ప్రేమలో పడింది. మైనర్‌ను వేధిస్తున్నాడనే ఆరోపణలపై అతనిపై జవహర్‌నగర్, బొల్లారం పోలీస్ స్టేషన్లలో ఫోక్సో, అత్యాచారం కేసులు నమోదయ్యాయి. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా కుమార్ సింగ్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో అంజు అతన్ని తీవ్రంగా మందలించింది. దీంతో తల్లిని హత్య చేస్తేనే ప్రియుడు తనకు దక్కుతాడనే భావనలో పడిన ఇషికా, కుమార్ సింగ్‌తో కలిసి పథకం రచించింది.

2025 మే 12న అంజు ఇంటికి వచ్చిన సమయంలో ఇద్దరూ కలిసి కత్తితో ఛాతిలో పొడిచి, ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా మృతదేహాన్ని ఇంట్లోనే పాతిపెట్టారు. నేలకు ఎలుకల వల్ల మరమ్మతులు చేశామని పెద్ద కుమార్తె రోషిణిని తప్పుదోవ పట్టించారు. తల్లి బయటకు వెళ్లిందని కూడా నమ్మించారు. అంజు ఇంటికి నెలలు గడిచినా తిరిగి రాకపోవడంతో పెద్ద కుమార్తెకు అనుమానం వచ్చి 2025 అక్టోబర్ 17న జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా ఇషికా ఇటీవల కుమార్ సింగ్‌తో కలిసి యాదగిరిగుట్టలో వివాహం చేసుకుంది. ఇద్దరికీ రెండు నెలల క్రితం కుమారుడు జన్మించాడు.

విచారణలో భాగంగా పోలీసులకు అనుమానం కలగడంతో ఇషికా, కుమార్ సింగ్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. అనంతరం పోలీసులు కౌకూర్ భరత్‌నగర్‌లోని అంజు ఇంటిని పరిశీలించి గదిలో పాతిపెట్టిన మృతదేహాన్ని వైద్యుల సమక్షంలో వెలికి తీశారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అదృశ్య కేసును ఛాకచక్యంగా ఛేదించిన జవహర్‌నగర్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

సురవరం సుధాకర్ రెడ్డి ఆదర్శప్రాయుడు

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

బలగం టీవీ, హైదరాబాద్

కమ్యూనిస్టు అగ్రనేత, సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి పార్టీ శ్రేణులకు ఆదర్శప్రాయమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లినప్పుడే నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని అన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి 84వ జయంతిని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో "సురవరం సుధాకర్ రెడ్డి స్వీయ చరిత్ర", "ప్రజలతో నా ప్రయాణం" పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డి.రాజాతో పాటు జస్టిస్ బీ.సుదర్శన్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా రాజకీయ జీవితం ప్రారంభించిన సురవరం సుధాకర్ రెడ్డి అంచెలంచెలుగా ఎదిగి దేశంలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. ప్రజలతో కలిసి జీవిస్తూ వారి సమస్యలను అర్థం చేసుకుని ఉద్యమాలను ముందుకు నడిపినప్పుడే పార్టీ నిజమైన ప్రజా పార్టీగా ఎదుగుతుందని పార్టీ శ్రేణులకు సూచించారు. దేశంలో వామపక్ష బలం తగ్గుతున్న నేపథ్యంలో కమ్యూనిస్టు శక్తుల ఐక్యత అత్యవసరమని, ఇందుకు సురవరం చేసిన కృషి అపారమని పేర్కొన్నారు.

జస్టిస్ బి.సుదర్శన్ మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి జీవితం దేశం, తెలంగాణ ప్రజలతో విడదీయరాని అనుబంధంగా ముడిపడి ఉందన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినా తన ఆలోచనలు, సేవలు నిత్యం ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థి నాయకుడు, యువ నాయకుడు, కమ్యూనిస్టు నాయకుడిగా ఆయన పార్లమెంటేరియన్‌గా విశేష సేవలు అందించారని కొనియాడారు. సభాధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి సురవరం సుధాకర్ రెడ్డి సురస్వరమని పేర్కొన్నారు. ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడి అంతిమయాత్రకు ప్రజలు ఇచ్చిన గౌరవం ఆయనకు ఉన్న ప్రజాభిమానానికి నిదర్శనమన్నారు. కమ్యూనిస్టులుగా తమ బాధ్యతను నెరవేర్చుకుంటూ ముందుకు సాగడమే ఆయనకు నిజమైన నివాళి అని చెప్పారు. సీపీఐ సీనియర్ నాయకుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి, యువజన నాయకుడిగా సురవరం చేపట్టిన అనేక పోరాటాలను గుర్తు చేసుకున్నారు. 18 ఏళ్లకే ఓటుహక్కు, బ్యాంకుల జాతీయీకరణ, నిరుద్యోగ భృతి వంటి అంశాలపై ఆయన చేసిన ఉద్యమాలు విశేషమని తెలిపారు.

సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ ఎంపీగా ఉన్న సమయంలో ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న ప్రజలకు కృష్ణా జలాలు అందించేందుకు సురవరం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో ఏ ముఖ్యమంత్రికైనా ఆయనపై ప్రత్యేక గౌరవం ఉండేదని అన్నారు. బి.వి. విజయలక్ష్మి మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి తన స్వీయ అనుభవాలను పుస్తకరూపంలో రాయాలని తొలుత ఆలోచించకపోయినా, పార్టీ నాయకుల సూచనతో చివరి దశలో నోట్స్ రూపంలో రచించారని తెలిపారు. వాటిని సమగ్రంగా క్రోడీకరించి పుస్తకరూపంలో తీసుకువచ్చినట్లు చెప్పారు. తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకం వామపక్ష ఉద్యమకారులతో పాటు రాజకీయ నాయకులందరికీ ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పుస్తక సమీక్ష సందర్భంగా సురవరం సుధాకర్ రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన భావోద్వేగానికి గురయ్యారు.

భార్యపై కోపంతో రెండేళ్ల కూతురుని కడతేర్చిన తండ్రి

- యాదాద్రి జిల్లాలో విషాదం..
- కుమార్తెకు సపోటా పండులో ఎలుకల మందు కలిపి హత్య, అనంతరం తాను ఆత్మహత్యాయత్నం

బలగం టీవీ, యాదాద్రి భువనగిరి:

కుటుంబ కలహాలు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకోగా, మరొకరి పరిస్థితి విషమంగా మారిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటుచేసుకుంది. సంస్థాన్ నారాయణపురం మండలం లక్ష్మమ్మగూడెం గ్రామంలో తండ్రి తన చేతులతోనే కూతురికి విషమిచ్చి, అనంతరం తాను కూడా ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

లక్ష్మమ్మగూడెం గ్రామానికి చెందిన రవి, స్వాతి దంపతులకు మేఘన (2), మయూరి (9 నెలలు) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతుండటంతో, మూడు నెలల క్రితం భార్య స్వాతి చిన్న కూతురు మయూరిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్ద కుమార్తె మేఘన తండ్రి రవి వద్దే ఉంటోంది. పెద్ద కూతురిని కూడా తన వద్దకు పంపాలని స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఈ క్రమంలో కూతురు తన నుంచి దూరమవుతుందనే బాధ, పరువు పోయిందనే ఆవేదనతో రవి తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. బుధవారం ఉదయం రవి తన పెద్ద కుమార్తె మేఘనకు సపోటా పండులో ఎలుకల మందు కలిపి తినిపించాడు. అనంతరం తాను కూడా అదే మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వారిద్దరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండేళ్ల చిన్నారి మేఘన మృతి చెందింది. రవి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కుటుంబ కలహాలే ఈ దారుణానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రస్తుతం పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బెజ్జంకి జాతర పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

బలగం టీవీ, బెజ్జంకి:

బెజ్జంకి శ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం హైదరాబాద్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆలయ ధర్మకర్తలను కోరారు. ఆలయంలో ప్రతియేటా చైత్ర శుద్ధసప్తమి నుంచి చైత్ర బహుళ సప్తమి వరకు జరిగే ఈ బ్రహోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించాలన్నారు. ఏకశిలతో నిర్మితమైన ఈ ఆలయానికి ఎంతో ప్రాశస్యత ఉందని, కోరికలు తీర్చే ఇలవేల్పుగా భావిస్తూ భక్తులు ఈ జాతరకు కరీంనగర్, సిద్ధిపేట, హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచే కాకుండా నాగపూర్, నాందేడ్, గుల్బర్గా, ముంబాయి వంటి దూర ప్రదేశాల నుంచి భారీగా తరలి వస్తుంటారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు.విజయవంతంగా జాతర నిర్వహించేందుకు అందరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ఆకాంక్షించారు. అంతకు ముందు ఆలయ చైర్మన్ జెల్ల ప్రభాకర్ పూజారి, ధర్మకర్తలతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. స్వామివారి కళ్యాణం, శకటోత్సవం, రథోత్సవాలకు హాజరు కావల్సిందిగా వారు ఎమ్మెల్యేను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఆలయ పూజారి శేష మధుసూదనచారి, ధర్మకర్తలు బెజుగాం ప్రసాద్, గుబిరే చంద్రం, పొట్టపల్లి ప్రభాకర్, బోనాల మల్లేశం, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, పురుమ నారాయణరెడ్డి, ఐలేని మహేందర్ రెడ్డి, బుట్ల చంద్రప్రకాశ్, ఇస్కిల్లా ఐలయ్య, బోనగిరి శ్రీనివాస్, కొండ్ల ప్రకాష్, జంగిటి శంకర్, దొమ్మాటి శ్రీహరి తదితర నాయకులు పాల్గొన్నారు.

జనగామ కలెక్టర్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు..

- దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశాలు

బలగం టీవీ, జనగామ:

జనగామ జిల్లాలోని వనిత టీ స్టాల్ నిర్వాహకురాలు పాలమాకుల చిన్న మంజుల, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝుపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి తనకు జరిగిన అన్యాయంపై వివరించారు.

తనకు ప్రభుత్వం అనుమతించిన ఇందిరా శక్తి మహిళా పథకం కింద నిర్వహిస్తున్న టీ స్టాల్‌ను తొలగించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్, రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి ఇబ్బందులకు గురి చేశారని మంజుల ఆరోపించారు. జేసీబీలు, క్రేన్లతో తన దుకాణాన్ని తొలగించే ప్రయత్నం చేశారని, దీంతో తాను మానసికంగా మరియు ఆర్థికంగా నష్టపోయానని తెలిపారు. అలాగే, తన సమస్యను వివరించేందుకు కలెక్టర్‌ను కలిసినప్పుడు తనను పట్టించుకోకపోగా అవమానకరంగా ప్రవర్తించారని, గన్‌మన్‌తో నెట్టివేయించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కలెక్టర్‌పై తగిన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదుపై స్పందించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్‌కు నోటీసు జారీ చేస్తామని తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రికి కూడా నివేదిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా, జనగామ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదుపై స్పందిస్తూ, జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో ఫోన్‌లో మాట్లాడి దర్యాప్తును వేగవంతం చేసి బాధిత మహిళకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బాధిత మహిళతో పాటు డీఎస్ఎంఎం జాతీయ కమిటీ సభ్యురాలు పల్లెర్ల లలిత, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు తిప్పారపు విజయ్ కుమార్, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ బూడిది గోపి, దళిత యువజన సంఘం నాయకుడు గూడరు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, జీహెచ్ఎంసీ కమిషనర్, జలమండలి ఎండీ జాయింట్ ఇన్‌స్పెక్షన్

బలగం టీవీ, హైదరాబాద్

అంబర్ పేట్ శాసనసభ నియోజకవర్గంలో మురుగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి ఇరుశాఖల ఆధ్వర్యంలో సంయుక్త కార్యచరణ చేపట్టనున్నారు. నియోజకవర్గం అంబర్ పేట్, పటేల్ నగర్, గోల్నాక ప్రాంతంలోని నాలా పరివాహక ప్రాంతంలో వర్షాకాలంలో ఈ ప్రాంత నివాసులు పలు ఇక్కట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, స్థానిక శాసన సభ్యుడు కాలేరు వెంకటేష్ కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరణ, జీహెచ్ఎంసీ ప్రాజెక్టు విభాగం చేపట్టిన నాలా విస్తరణ పనుల కారణంగా సమీప ప్రాంతాలలో జీహెచ్ఎంసీ చిన్న చిన్న రెయిన్‌వాటర్ డ్రైన్లు, జలమండలికి సంబంధించిన సీవరేజ్ లైన్ల ను ధ్వాంసం చేయడంతో మురుగు సమస్య తీవ్రమైంది. మొదటగా కింగ్స్ హోటల్, అంబర్‌పేట్ ప్రాంతంలో ఉన్న స్టార్మ్ వాటర్ డ్రైన్ పునర్ నిర్మాణం సాధ్యాసాధ్యాలు, ఉస్మానియా యూనివర్సిటీ నుండి పటేల్ నగర్ నాలా వరకు ఉన్న వాన నీటిని కాలువను పరిస్థితిని అధికారులు సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, పోలీస్ గ్రౌండ్స్ గుండా కొత్త స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణం చేపడితే ఓ మేరకు సమస్య తీరినట్టేనని అంచనా వేశారు. అలాగే, దీనికి సమాంతరంగా ట్రంక్ సీవర్ పైప్ నిర్మించాలని జలమండలి ఎండీని కోరారు. నాలా విస్తరణ పనుల సమయంలోని సమాంతరంగా జలమండలి సీవరేజ్ లైన్ల నిర్మాణం సైతం పూర్తి చేయాలని జలమండలి అధికారులకు ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఉన్న ఇంటర్‌సెప్షన్ అండ్ డైవర్షన్ (ఐడీ) వ్యవస్థను పరిశీలించారు. మురుగు నీటి ప్రవాహాలు సక్రమంగా ఎస్టీపీకి అనుసంధానం ఉన్నట్లు గుర్తించారు. భవిష్యత్తులో మురుగు నీటిని నాలాలలోకి మళ్లించకుండా పూర్తి స్థాయి సీవరేజ్ వ్యవస్థకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఇరు శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఈడీ సామ్రాట్ అశోక్, ఆపరేషన్ డైరెక్టర్ వినోద్ భార్గవ, సీజీఎం సుబ్రహ్మణ్యం, జీఎంశ్రీధర్ రెడ్డితో పాటు జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సేవలు వినియోగించుకోవాలి

- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

దివ్యాంగ విద్యార్థులు భవిత కేంద్రం సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో భవిత కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. భవిత కేంద్రం పరిధిలో మొత్తం ఎందరు దివ్యాంగులు ఉన్నారు? ఏ ఏ సేవలు వారికి అందిస్తారో ఆరా తీశారు.

అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో భవిత కేంద్రం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. దీని సేవలను దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి బుధవారం, గురువారం ఐఈఆర్సీ, ఫిజియోథెరపిస్ట్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. అనంతరం మండల సమాఖ్య భవనాన్ని పరిశీలించి, ఎందరు సభ్యులు ఉన్నారని, స్వయం ఉపాధి, సంఘాల ఆర్థిక కార్యకలాపాలపైన ఆరా తీశారు. అక్కడి నుంచి జూనియర్ కళాశాల మైదానంలో పనులను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, ఎంఈవో కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి..

- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఈ నెల 28వ తేదీ శనివారం నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని, రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన నిర్వహణ కేసులు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు తదితర రాజీ పడదగిన వివిధ కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. జుడీషియల్ శాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ఇరుపక్షాలు వినియోగించుకొని శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్‌లు మరియు ఇతర సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిరేలా అవగాహన కల్పిస్తారని వెల్లడించారు.రాజీ ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలనుకునే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

అంగరంగ వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం..

బలగం టీవీ, ఇల్లంతకుంట:

ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో శ్రీ సీతారాముల శివంజనేయ దేవస్థానం లో ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం వేదపండితులు, మహిళా మూర్తులు, ఆంజనేయ మాలధారణ స్వాములు గణపతి పూజ, ప్రత్యేక హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గ్రానైట్‌తో తయారు చేసిన ధ్వజస్తంభాన్ని రామ నమ స్మరణ లతో ప్రజలు భక్తి శ్రద్ధ లతో ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వొల్లాల రజిత వెంకటేశం, వేద పండితులు చెరుకు పవన్ శర్మ,డాక్టర్ శ్రీ గోవర్ధన ప్రవీణ్ కుమార్ ఆచార్య, శ్రీ శేశం మురళి మోహన ఆచార్య, శ్రీ హర్ష గ్రామ మాజి ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామ యువకులు, ఆంజనేయ స్వామి మాలధారణ స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సేవా భావానికి ప్రతీకగా సిలుముల జయవర్ధన్

- కరపత్రం ఆవిష్కరణ

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ నగర్ కు చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు సిలుముల జయవర్ధన్ పై ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన రచయిత వాసరవేణి పరుశరాం రూపొందించిన "సేవా భావానికి నిదర్శనం సిలుముల జయవర్ధన్" కర పత్రాన్ని సిద్దిపేట ప్రెస్ క్లబ్లో మంజీర రచయితల సంఘ సమావేశంలో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకడామి అవార్డు పొందిన నందిని సిధా రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ఒక ఉద్యమకారుడు తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్రలను, సమాజంలో చేసిన సేవా కార్యక్రమాలను వాసరవేణి పరుశరాం కరపత్రం రూపంలో వెలుగులోకి తీసుక రావడం అభినందనీయం అని పేర్కొన్నారు. విద్యార్థి జీవితం పూర్తి చేసి తెలంగాణ ఉద్యమంలోకి అడుగుపెట్టి, తెలంగాణ పునర్ నిర్మాణంలో జయవర్ధన్ చేసిన కార్యక్రమాలు, పనులు ఆదర్శం, అభినందనీయం, సమాజ స్ఫూర్తికి ఉపయోగపడతాయని కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత నందిని సిధా రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నందిని సిధా రెడ్డి ని జయవర్ధన్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కె. రంచారి, సిలుముల జయవర్ధన్, పల్లె ఎల్లయ్య సిద్దంకి యాదగిరి తదితర కవులు, రచయితలు పాల్గొన్నారు.

జోగాపూర్ రాములోరి పట్టు వస్త్రాలు సిద్ధం..

బలగం టీవీ, చందుర్తి:

చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలోని శ్రీ రామాలయంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా, ఆధ్యాత్మిక వైభవంగా జరగనున్నాయి. ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామ సర్పంచ్‌తో పాటు ఆలయ పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించింది. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా దేవతల అలంకరణ కోసం పట్టు వస్త్రాలు అవసరమని ఆలయ అర్చకులు తెలియజేయగా, రామారావుపల్లి గ్రామానికి చెందిన బోజరాజు పద్మ తన కుట్టు యంత్రంతో శ్రీ రాముడు, సీతమ్మ, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి వారికి అందమైన పట్టు వస్త్రాలను కుట్టి సిద్ధం చేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ.. తాను గత 8 సంవత్సరాలుగా సనుగుల శ్రీ గోవిందరాజుల స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడంతో పాటు జోగాపూర్ రామాలయం దేవతా మూర్తులకు కూడా పట్టు వస్త్రాలను అందజేస్తూ వస్తున్నానని తెలిపారు. గ్రామస్తులు ఈ సేవను అభినందిస్తూ, రాబోయే శ్రీరామ నవమి వేడుకలు భక్తుల సమక్షంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలి..

- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ, కోనరావుపేట:

రైతులు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక లో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కోనరావుపేట మండలం ధర్మారంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల తయారీ కేంద్రంలో బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సేంద్రియ ఉత్పత్తుల తయారీ కేంద్రంలో కషాయాలు, సేంద్రియ ఎరువు అలాగే తయారీ విధానం పశువుల పెంపకం ఇతర అంశాలను కలెక్టర్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు రైతులకు మద్దతుగా నిలుస్తున్నాయని తెలిపారు. జిల్లాకు 9 బయో ఇన్ పుట్ రిసోర్స్ సెంటర్(బీఆర్సీ)సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు తయారీ కేంద్రాలు) మంజూరు చేసిందని వెల్లడించారు. ఒక్కో కేంద్రానికి లక్ష రూపాయలు అందజేసిందని తెలిపారు. ఆయా కేంద్రాల్లో సేంద్రియ ఎరువులు, కషాయాలు ఆవు పేడ ఇతర పదార్థాలతో సిద్ధం చేసిన వాటిని రైతులు సాగులో వినియోగించుకునేందుకు తోడ్పాటు అందించేందుకు ఈ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు రైతులు తమ పరిధిలోని సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తి తయారీ కేంద్రాలు సందర్శించి సాగులో ఆయా ఉత్పత్తులను వినియోగించాలని సూచించారు. రైతులకు వ్యవసాయ శాఖ ఆర్థికంగా భరోసా ఇస్తుందని తెలిపారు. దీంతో నేలకు పర్యావరణానికి ఎంతో మేలు అని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి...

- ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసుకోవాలి..
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అందిస్తున్న ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో హౌసింగ్ మోడల్ హౌస్ ను కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులతో కలిసి బుధవారం ప్రారంభించారు.

అనంతరం ఇందిరమ్మ ఇండ్ల కింద ఎంపిక చేసిన పైలెట్ గ్రామం ఎల్లారెడ్డిపేట మండలం గుండారానికి చెందిన సిద్ధాల అఖిల, కంకణాల శ్రీలత, ఇందిరాల మమత, లకావత్ సునీత ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులు, ప్రజాప్రతి నిధులతో కలిసి ప్రారంభిం చారు. గృహ ప్రవేశం చేసి, లబ్ధిదారుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 6 నుంచి జూన్ 12 వ తేదీ వరకు వివిధ శాఖలకు సంబంధించిన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. 10 శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు . హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన మోడల్ హౌస్ లో ఉష్ణోగ్రత కొన్ని డిగ్రీలు తగ్గించేందుకు, స్లాబ్ నిర్మాణ ఖర్చు తగ్గించేందుకు ఫిల్లర్ రూఫింగ్ విధానంలో పూర్తి చేయడాన్ని చూసి అభినందించారు.రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నాలుగు విడతల్లో రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు . ప్రభుత్వం సూచించిన ధరలోనే ఇండ్లను నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని, లబ్ధిదారులకు అన్ని రకాల సామగ్రి, పనివారు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటిదాకా 777 ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయ్యాయని కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఈ సాజిద్, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలి

- రాజన్న సిరిసిల్లలో టీపీటీఎఫ్ భారీ నిరసన..
- ప్రభుత్వ వైఖరిపై విద్యావేత్తలు, ఉపాధ్యాయుల ఆగ్రహం -- సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ వద్ద ప్రదర్శన

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, ఈరోజు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు దుమాల రమనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై గళమెత్తారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రమానాథ్ రెడ్డి మాట్లాడుతూ.. మార్చి 20న ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 8.22 శాతం (?26,674 కోట్లు) కేటాయించడం శోచనీయమన్నారు. కొఠారి కమిషన్ 30 శాతం, రాష్ట్ర విద్యా కమిషన్ 18 శాతం, మరియు ఎన్నికల మేనిఫెస్టోలో 15 శాతం హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం కోతలు విధించిందని విమర్శించారు. నిధుల కొరత వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు క్షీణించి, విద్యార్థుల నమోదు పడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లు గడిచినా నూతన పీఆర్సీ ఫిట్మెంట్ ప్రకటించకపోవడం, రిటైర్డ్ ఉపాధ్యాయులకు పెన్షనరీ ప్రయోజనాలు అందకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ టీచర్ల వ్యవస్థను రద్దు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, దీనివల్ల ఉపాధ్యాయ లోకం తీవ్ర ఆర్థిక, మానసిక ఆందోళనకు గురవుతోందని పేర్కొన్నారు.

ప్రభుత్వానికి సమర్పించిన ప్రధాన డిమాండ్లు.. విద్యారంగానికి బడ్జెట్‌లో కనీసం 20 శాతం నిధులు కేటాయించాలి. వెంటనే పీఆర్సీ ఫిట్మెంట్ ప్రకటించి, బడ్జెట్లో నిధులు విడుదల చేయాలి. రిటైర్డ్ టీచర్ల పెన్షనరీ ప్రయోజనాలను ఏకమొత్తంలో చెల్లించాలి. సీపీఎస్ (జూరా) రద్దు చేసి, 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలి. పెండింగ్‌లో ఉన్న టీచర్ల బిల్లులు, డీఏ (ణూరా)లను వెంటనే క్లియర్ చేయాలి. కాంట్రాక్ట్ టీచర్ల వ్యవస్థను రద్దు చేసి, రెగ్యులర్ నియామకాలు చేపట్టాలి. కేజీబీవీ, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ టీచర్లకు నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలి. డిమాండ్ల పరిష్కారానికి చొరవచూపగలరని ప్రభుత్వాన్ని టీపీటీఎఫ్ డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ చైతన్య, దేవేందర్, శ్రీధర్, వాసుదేవరావు, తిరుపతి, రామచంద్రం, బస రాజేందర్, కృష్ణ, వేణు, బండి ఉపేందర్, మధుసూదన్, రజినీ రాణి, ఎల్లారెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు పురుషోత్తం, వెంకన్న, బొజ్జ కృష్ణ మరియు వివిధ మండలాల బాధ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కామీనేని నీలి శంకర్‌కు ఘన నివాళులు..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

సిరిసిల్లకు చెందిన మాజీ కౌన్సిలర్, మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షులు కామీనేని నీలి శంకర్ అనారోగ్యంతో కన్నుమూయడం పట్ల ప్రాంతవ్యాప్తంగా తీవ్ర విషాదం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన సంతాప సభకు టెస్కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్ రావు హాజరై, శంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ.. కామీనేని నీలి శంకర్ ప్రజా సేవలో ఎంతో కృషి చేసిన వ్యక్తి అని, ఆయన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. సంతాప సభలో పలువురు ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

రాజిరెడ్డికి బీజేపీ నేతల ఘన నివాళి..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రాజిరెడ్డి గుండెపోటుతో ఆకస్మాత్తుగా పరమపదించడం పార్టీకి తీరని లోటుగా నిలిచింది. నేడు వారి దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి వారి చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. రాజిరెడ్డి పార్టీ అభివృద్ధికి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని, ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పి, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజిరెడ్డి కి ఘన నివాళులర్పించారు.

పారిశుధ్య విభాగాన్ని ప్రక్షాళన చేయాలి

- రామగుండం కార్పొరేషన్ కమిషనర్‌కు బీఆర్ఎస్ కార్పొరేటర్ల ఫిర్యాదు

బలగం టీవీ, రామగుండం

రామగుండం నగర పాలక సంస్థలో కీలకమైన పారిశుధ్య విభాగాన్ని ప్రక్షాళన చేయాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు కమిషనర్ జే. అరుణశ్రీని కలిసి ఫిర్యాదు చేశారు. కౌన్సిల్ సమావేశం అనంతరం 58వ డివిజన్ కార్పొరేటర్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్, 60వ డివిజన్ కార్పొరేటర్ మేకల శారద తమ సమస్యలను వివరించారు. కార్పొరేషన్ రికార్డుల ప్రకారం 448 మంది శానిటేషన్ కార్మికులు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వారు విధులు నిర్వర్తించడం లేదని ఆరోపించారు. కొంతమంది కార్మికులను అధికారులు, ప్రజాప్రతినిధుల వ్యక్తిగత పనులకు మళ్లిస్తున్నారని పేర్కొన్నారు. తమ డివిజన్లలో చెత్త సేకరణ ట్రాలీలు సక్రమంగా రాకపోవడంతో పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. శానిటేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 58వ డివిజన్‌లో రోడ్డు అభివృద్ధి కోసం ప్రజలు స్వచ్ఛందంగా ఇళ్ల కొంత భాగం తొలగించుకున్నప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. డివిజన్‌కు కేవలం ఒక చెత్త సేకరణ ట్రాలీ మాత్రమే కేటాయించారని, ఒక్కసారి చెత్త తీసుకెళ్లిన తర్వాత వారం రోజుల వరకు ట్రాలీ కనిపించదని అన్నారు. చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం, దోమల సమస్యలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పారిశుధ్య లోపాలపై ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని కార్పొరేటర్లు తెలిపారు.

పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై ప్రజల్లో ఆందోళన

- పట్టించుకోని ప్రభుత్వాలు
- ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కల్వకుంట్ల సంజయ్ ఆవేదన

బలగం టీవి, హైదరాబాద్

పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని, హైదరాబాద్ నగరంలో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కల్వకుంట్ల సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఇంధన కొరత తీవ్రమైందని, గతంలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కినట్టుగా, ఇప్పుడు సామాన్య ప్రజలు పెట్రోల్, డీజిల్ కోసం బారులు తీరాల్సిన దుస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆవేదన వ్యక్తం చేశారు. 'యుద్ధం జరుగుతున్న దేశాల్లో లేని కొరత మన దేశంలో ఎందుకు తలెత్తింది? ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం వల్లే.. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సరైన నివేదికలు ఇచ్చి, ముందస్తుగా నిల్వలను పెంచుకోవడంలో విఫలమైంది' అని విమర్శించారు. పరిపాలనను గాలికి వదిలేసి సీఎం గాలికి తిరుగుతున్నారని, బాధ్యతాయుతమైన ప్రభుత్వం నిందలు వేసుకోవడం మానేసి, సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'ప్రధాని మోడీ ప్రజలకు ధైర్యం చెప్పాల్సింది పోయి.. ప్రస్తుత పరిస్థితు లను కరోనా కష్టకాలంతో పోలుస్తూ భయపెడుతున్నారు. సీఎం ఢిల్లీకి వెళ్లి ఇంధన సమస్యను పరిష్కరిస్తారని ఆశించాం. కానీ ఆయన ఒట్టి చేతులతోనే తిరిగి వచ్చారు' అని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. అసలు దేశంలో, రాష్ట్రంలో ఎంత మేర నిల్వలు ఉన్నాయో చెప్పే ధైర్యం ప్రధానికిగానీ, ముఖ్యమంత్రికిగానీ లేదని, పారదర్శకత లోపించిందని విమర్శించారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి, ఇరు ప్రభుత్వాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో నిత్యావసరాల విషయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందు లూ కలగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ఇంధన కొరత లేదని స్పష్టం..

వదంతులను నమ్మొద్దని పెట్రోలియం అసోసియేషన్ విజ్ఞప్తి

బలగం టీవీ, హైదరాబాద్:

రాష్ట్రంలో ఇంధన కొరత ఉందన్న వార్తలను తెలంగాణ పెట్రోలియం అసోసియేషన్ ఖండించింది. పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, అన్ని ప్రాంతాల్లో సాధారణంగా సరఫరా కొనసాగుతోందని తెలిపింది. హెచ్‌పీసీఎల్ , ఐఓసీఎల్ , బీపీసీఎల వంటి ప్రధాన పెట్రోలియం కంపెనీల వద్ద అవసరానికి మించి నిల్వలు ఉన్నాయని అసోసియేషన్ స్పష్టం చేసింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఇంధన కొరతపై వస్తున్న వదంతులను నమ్మకూడదని, అవసరానికి మించి పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. సాధారణ వినియోగానికి అనుగుణంగా మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని సూచించింది. అన్ని పెట్రోల్ బంక్‌లలో సరఫరా సాధారణంగానే కొనసాగుతోందని, ప్రజలు ప్రశాంతంగా ఉండాలని తెలంగాణ పెట్రోలియం అసోసియేషన్ కోరింది.

హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదు

- అసెంబ్లీలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బలగం టీవి, హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 28 నెలలు గడుస్తున్నా హైదరాబాద్ నగరంలో ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని నిలదీశారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకంతో పేదల సొంత ఇంటి కలను నెరవేర్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. మొత్తం 2.31 లక్షల ఇండ్లను మంజూరు చేసి అందులో 1.62 లక్షల ఇండ్లను నిర్మించామని తెలిపారు. జంట నగరాల పరిధిలో 65 వేల ఇండ్లను లాటరీ విధానంలో పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు కేటాయించామని వెల్లడించారు. సనత్‌నగర్‌లోని ఐడీహెచ్ కాలనీలోనే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. అప్పటి గవర్నర్ నరసింహన్ ఈ ఇండ్లను సందర్శించి ప్రశంసించిన విషయాన్ని గుర్తు చేశారు. జంట నగరాల్లోని బస్తీల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అక్కడే 70 సంవత్సరాలుగా నివసిస్తున్న అర్హులైన పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ పథకంపై విమర్శలు చేస్తున్న వారు తనతో వస్తే బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఇండ్ల నాణ్యతను చూపిస్తానని సవాల్ విసిరారు.

కడియం వ్యాఖ్యలపై పల్లా తీవ్ర విమర్శలు

బలగం టీవి, హైదరాబాద్

స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకం సృష్టికర్తగా తానేనని కడియం చెప్పుకోవడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దేవాదుల ప్రాజెక్టు కోసం కడియం ఎలాంటి పాత్ర పోషించలేదని పల్లా ఆరోపించారు. అప్పట్లో బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఇప్పుడు సృష్టికర్తగా చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కడియం శ్రీహరికి రాజకీయంగా అనేక అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వంటి కీలక పదవులతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు కూడా ప్రాధాన్యత ఇచ్చిన విషయాన్ని విస్మరించరాదన్నారు. కేసీఆర్ ఇచ్చిన అవకాశాల వల్లే ఆయన ఈ స్థాయికి ఎదిగారని పేర్కొన్నారు కడియం నిజాయతీ గల నాయకుడు కాదని, బినామీ పేర్లతో భారీగా ఆస్తులు కూడబెట్టారని పల్లా సంచలన ఆరోపణలు చేశారు. నైతికత గురించి ఆయన మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగినా, రాజకీయ సమీకరణలు మారినా జనగామ ప్రజలకు సేవ చేయడం కొనసాగిస్తానని, అక్కడి ప్రజలతో తన అనుబంధం విడదీయలేనిదని పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

పెద్దపల్లిలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు చర్యలు

బలగం టీవి, పెద్దపల్లి

జిల్లాలో ఆయిల్‌పామ్ పంట సాగును విస్తరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సుల్తానాబాద్ మండలంలోని బొంతకుంటపల్లి గ్రామంలో బుధవారం ఆయన పర్యటించి రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని కూడా సమీక్షించారు. ఆయిల్‌పామ్ సాగు, దిగుబడులు, మార్కెటింగ్ వంటి అంశాలపై రైతులతో మాట్లాడిన కలెక్టర్, ఈ పంట ద్వారా రైతులకు లభించే ఆదాయం గురించి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 3,600 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని, దీన్ని మరింతగా పెంచే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో తొలి ఏడాది 1,253 ఎకరాల్లో సాగు చేయగా ఇప్పటికే కొంతమేరకు కోతలు ప్రారంభమయ్యాయని, దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతులకు లాభదాయకంగా మారిందన్నారు. ముత్తారం, శ్రీరాంపూర్, ధర్మారం మండలాల్లో కూడా కటింగ్ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు ఉత్పత్తి విక్రయాల తర్వాత మూడు నుంచి నాలుగు రోజుల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు.

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం పదిలక్షల ఎకరాలు కాగా పెద్దపల్లి జిల్లాకు 45 వేల ఎకరాల లక్ష్యం నిర్ధారించబడినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం టన్నుకు రూ.21,546 ధర లభిస్తోందని, ప్రభుత్వ సబ్సిడీలు అధికంగా ఉండటంతో రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపాలని కలెక్టర్ సూచించారు. బొంతకుంటపల్లి గ్రామంలో ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటగా వేసిన కోకో పంటను కూడా ఆయన పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లుల చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా యుద్ధనౌకపై ఇరాన్ క్షిపణి దాడి

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరుగుదల

బలగం టీవి, న్యూఢిల్లీ

పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. అమెరికాకు హెచ్చరికలు జారీ చేసిన అనంతరం, ఇరాన్ అమెరికాకు చెందిన యుద్ధనౌకపై క్షిపణి దాడి చేసినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ విడుదల చేసినట్లు సమాచారం. అయితే ఈ దాడిపై అమెరికా నుంచి ఇప్పటివరకు అధికారిక ధృవీకరణ వెలువడలేదు.

ఇరాన్ సైన్యం ప్రజా సంబంధాల విభాగం ప్రకారం తీర ప్రాంతం నుంచి ప్రయోగించిన క్రూయిజ్ క్షిపణులు అమెరికా యుద్ధనౌక దిశగా ప్రయాణించినట్లు పేర్కొంది. దాడికి ముందు ఇరాన్ నౌకాదళం అమెరికాకు నేరుగా హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపింది. ఇరాన్ సముద్ర పరిధికి సమీపంలోకి వస్తే ఆ యుద్ధనౌకను లక్ష్యంగా చేసుకునే అవకాశముందని హెచ్చరించిన గంటలోపే క్షిపణులు ప్రయోగించినట్లు సమాచారం.

ఇరాన్ నౌకాదళాధిపతి రియర్ అడ్మిరల్ షహ్రామ్ ఇరానీ మాట్లాడుతూ ఆ యుద్ధనౌక తమ క్షిపణి పరిధిలోకి వస్తే దాడి తప్పదని హెచ్చరించారు. ప్రస్తుతం ఆ నౌక కదలికలను నిరంతరం గమనిస్తున్నామని తెలిపారు. ఇక ఇరాన్ సైన్యాధికారులు అమెరికా వ్యూహాత్మక శక్తిపై విమర్శలు చేస్తూ వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రభావం తగ్గిపోతోందని, అది వ్యూహాత్మక వైఫల్యంగా మారుతోందని పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులకు గడువు విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం పరిస్థితులను కొంత శాంతింపజేసే చర్యగా భావిస్తున్నారు. ఇరాన్ నుంచి ప్రతిదాడుల హెచ్చరికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఉద్యోగాల నోటిఫికేషన్లు వెంటనే జారీ చేయాలి

దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగుల మెరుపు ధర్నా

బలగం టీవి, హైదరాబాద్

ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగులు బుధవారం మెరుపు ధర్నాకు దిగారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులతో పాటు జీపీవో, మోడల్ స్కూల్, విద్యుత్, వ్యవసాయ, అటవీ శాఖలు సహా మొత్తం 26 విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ జేఏసీ నాయకుడు ఇంద్రానాయక్, బీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా కుమార్, నిరుద్యోగుల సంఘం నాయకులు సోమేశ్ జాదవ్, నరేందర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి బస్‌స్టాండ్ వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ల ఆధారంగా 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని అసెంబ్లీలో చెప్పడం సిగ్గుచేటని నాయకులు విమర్శించారు. గత రెండున్నరేళ్లలో ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయకుండా కాలయాపన చేశారని ఆరోపించారు. ఉద్యోగాల వయోపరిమితిని 35 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు.

గ్రామీణ ప్రాంతాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్న జీవో నంబర్ 46ను రద్దు చేయాలని కూడా కోరారు. ఉద్యోగాల భర్తీ జరగకపోవడంతో ఇప్పటివరకు 18 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్ల జారీలో మరింత ఆలస్యం జరిగితే ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసులు నాయకులను అదుపులోకి తీసుకుని మలక్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ధర్నాలో ఆకాశ్, శంకర్, వంశీ, నవీన్ పట్నాయక్, శింబూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్లు వినియోగించే లబ్ధిదారులకు ఇందిరమ్మ బిల్లులు ఇవ్వాలి

- అసెంబ్లీలో ప్రభుత్వ విప్ విజయరమణారావు

బలగం టీవి, పెద్దపల్లి

ఉపాధి కోసం ట్రాక్టర్లు వినియోగిస్తున్న కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అసెంబ్లీలో ఇందిరమ్మ ఇళ్ల అంశంపై మాట్లాడారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన తెలిపారు. అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతగా ఐదు లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. అందులో సుమారు 4.5 లక్షల ఇళ్లలో 25 శాతం నిర్మాణం పూర్తయిందని, మిగిలినవి వివిధ దశల్లో కొనసాగుతున్నాయని వెల్లడించారు. బేస్‌మెంట్ దశ పూర్తి చేసుకున్న కొంతమంది లబ్ధిదారులకు సాంకేతిక కారణాల వల్ల బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎల్3 కేటగిరిలో ఉన్న లబ్ధిదారులకు గతంలో అమలులో ఉన్న నిబంధనల వల్ల సిమెంట్ డ్రా చేసుకున్నవారికి, ఉపాధి కోసం ట్రాక్టర్లు వినియోగించే వారికి బిల్లులు రాకపోయిన పరిస్థితి ఉందని తెలిపారు. ఆ నిబంధనలను సవరించి సంబంధిత లబ్ధిదారులకు బిల్లులు చెల్లించే విధంగా మినహాయింపులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజయరమణారావు విజ్ఞప్తి చేశారు.

సమన్వయంతో మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యం

తొర్రూరులో బడ్జెట్ సమావేశంలో కలెక్టర్

బలగం టీవి, తొర్రూర్

సమన్వయంతో పనిచేస్తే మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రభుత్వ పక్షాన పూర్తి సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ శ్రావణ్ కుమార్ అధ్యక్షతన ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ సమక్షంలో మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్ బడ్జెట్ వివరాలను చదివి వినిపించారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి రూ.17.84 కోట్ల ఆదాయం, రూ.17.83 కోట్ల వ్యయంతో రూపొందించిన బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు.

వివిధ పద్దులపై చర్చించి ఆదాయ వనరులను పెంచే దిశగా చర్యలు చేపట్టాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌కు అనుగుణంగా నిధులు సమకూర్చుకుని ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలపై అదనపు భారం లేకుండా ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించాలని అన్నారు. పట్టణ పరిధిలోని ప్రతి వార్డును అభివృద్ధి చేయాలని, ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, రోడ్డు విస్తరణ, పట్టణ ప్రకృతి వనాల అభివృద్ధి, చెట్ల నాటకం, పరిశుభ్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా షెడ్యూల్ ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పట్టణంలో ప్రతిరోజు ఉదయం శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలు తమ పన్నులు బాధ్యతగా చెల్లించడం ద్వారా పట్టణ అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ సోమ రజిని, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 27న శ్రీ సీతారాముల కళ్యాణం

తలంబ్రాల తయారీలో మహిళా భక్తుల భాగస్వామ్యం

బలగం టీవి, చౌటుప్పల్

చౌటుప్పల్‌లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఈనెల 27వ తేదీ శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం మహిళా భక్త మండలి ప్రతినిధులు తలంబ్రాల కోసం వడ్లు వలిచి సిద్ధం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా మహిళా భక్తులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీ సీతారాముల కళ్యాణానికి తలంబ్రాలు తయారు చేయడం తమకు అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. చౌటుప్పల్ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరగాలని కోరుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త వర్మాల వెన్నెలతో పాటు బొబ్బిళ్ల సంధ్య, వెన్‌రెడ్డి సంధ్య, కామిశెట్టి శ్రీదేవి, ఉప్పల కుసుమ, ముత్యాల రామనర్సమ్మ, మచ్చ అంబిక, డాక్టర్ మంచికంటి రాజేశ్వరి, ఉప్పల దీపిక, వనం మమత, దాడి పద్మ, నిమ్మల అండాలు, జూకంటి రేవతి, గర్దాసు లక్ష్మి, యామిని, మల్లె శాలిని, రాజపేట శ్రీలత, మామిడి వెంకటమ్మ, నెక్కంటి అనూష, రమాదేవి, బద్దం స్వప్న, కథాల ఆశ, గోషిక లక్ష్మి, బొడిగె లావణ్య తదితర మహిళలు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం ఖాళీ చేయాలని కాంగ్రెస్‌కు కేంద్రం నోటీసులు

బలగం టీవి, న్యూఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీలోని 24, అక్బర్ రోడ్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని శనివారం లోగా ఖాళీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ బంగ్లా దాదాపు 48 సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంగా కొనసాగుతోంది. గత ఏడాది కోట్ల మార్గ్‌లోని ఇందిరా భవన్‌లో కొత్త ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం పార్టీ కార్యకలాపాలను అక్కడికి తరలించినప్పటికీ, అక్బర్ రోడ్‌లోని కార్యాలయాన్ని పూర్తిగా ఖాళీ చేయలేదని సమాచారం. ప్రస్తుతం కూడా అక్కడ కొన్ని పార్టీ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ బంగ్లాల్లో రాజకీయ పార్టీల కార్యకలాపాలు నిర్వహించరాదని కేంద్రం ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ నోటీసులు పంపినట్లు తెలిసింది. ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారి, ఉద్రిక్తతలకు దారితీయవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

సొంత ప్రభుత్వంపైనే షిండే విమర్శలు

జిల్లా పరిషత్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణ

బలగం టీవి, న్యూఢిల్లీ

మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తన సొంత మహాయుతి కూటమి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. సతార జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీజేపీ నేతలు పలు అక్రమాలకు పాల్పడ్డారని ఆయన విమర్శించారు. పౌరులు ఓటు వేయకుండా పోలీసులు అడ్డుకున్నారని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని షిండే ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సొంత కూటమి ప్రభుత్వంపైనే ఈ విధంగా విమర్శలు చేయడం అసాధారణమని, కూటమి పార్టీల మధ్య విభేదాలకు ఇది సంకేతమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మార్చి 20న జరిగిన సతార జిల్లా పరిషత్ ఎన్నికల్లో చైర్మన్ పదవికి శివసేన పోటీ చేసింది. శివసేన-ఎన్‌సీపీ కలిసి పోటీ చేసి అధిక ఓట్లు సాధించినప్పటికీ, బీజేపీకి చెందిన ప్రియా షిండే చైర్మన్‌గా ఎన్నికైనట్లు సమాచారం. శివసేన సభ్యుల్లో కొందరిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు ఓటింగ్‌కు వెళ్లకుండా నిర్బంధించారని షిండే ఆరోపించారు. ఈ ఘటనపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

రాజస్థాన్ రాయల్స్ విక్రయంతో షేన్ వార్న్ కుటుంబానికి రూ.450 కోట్ల లాభం

- ఐపీఎల్ తొలి సీజన్‌లో ఒప్పందంలోని క్లాజ్‌తో భారీ ఆదాయం

బలగం టీవి, న్యూఢిల్లీ

ఆస్ట్రేలియా స్పిన్ దిగ్గజం షేన్ వార్న్ దూరదృష్టి కారణంగా ఆయన కుటుంబానికి భారీ ఆర్థిక లాభం దక్కనుంది. ఐపీఎల్ తొలి సీజన్‌కు ముందు Rajasthan Royals జట్టుతో ఒప్పందం కుదుర్చుకునే సమయంలో వార్న్ ఒక ప్రత్యేక క్లాజ్ చేర్చినట్లు సమాచారం. 2008లో జట్టులో చేరినప్పుడు కెప్టెన్ బాధ్యతలతో పాటు క్రికెటింగ్ కార్యకలాపాలపై పూర్తి నియంత్రణ వార్న్‌కు అప్పగించారు. ప్రతి సీజన్ ఆడినందుకు జట్టులో 0.75 శాతం వాటా ఆయనకు ఇవ్వాలనే నిబంధనను ఒప్పందంలో చేర్చారు. నాలుగు సీజన్లు జట్టుకు సేవలందించిన వార్న్ మొత్తం 3 శాతం యాజమాన్య వాటాను సంపాదించారు.

ఇటీవల అమెరికాకు చెందిన కన్సార్టియం ఈ ఫ్రాంచైజీని సుమారు 1.63 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.15,000 కోట్లకు పైగా) కొనుగోలు చేసింది. దీంతో వార్న్ వాటా విలువ సుమారు రూ.450 నుంచి రూ.460 కోట్ల వరకు ఉండనున్నట్లు అంచనా. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత ఈ వాటాను విక్రయించి నగదు పొందేందుకు ఆయన కుటుంబానికి అవకాశం లభించనుంది. అయితే ఈ ఒప్పందానికి దీశ్ఖితీఎ బీసీసీఐ అనుమతి అవసరం. కాగా, ఐపీఎల్ తొలి సీజన్‌లోనే వార్న్ నేతృత్వంలో రాజస్థాన్ రాయల్స్ చాంపియన్‌గా నిలిచింది. ఫ్రాంచైజీని 2008లో కేవలం 67 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. 2022లో వార్న్ మరణించినప్పటికీ, ఆయన ముందుచూపుతో కుదుర్చుకున్న ఒప్పందం ఇప్పుడు కుటుంబానికి భారీ లాభాన్ని అందించనుంది.

కెరీర్ ఆరంభంలో వర్ణ వివక్షను ఎదుర్కొన్నాను

భారత మాజీ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ ఆవేదన

బలగం టీవి, న్యూఢిల్లీ

కెరీర్ ప్రారంభ దశలోనే వర్ణ వివక్ష ఘటనలను ఎదుర్కొన్నానని మాజీ భారత స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్ తరపున 25 మ్యాచ్‌లు ఆడిన ఆయన, 1983 ఏప్రిల్‌లో కేవలం 17 సంవత్సరాలు 118 రోజుల వయసులోనే వెస్టిండీస్‌లోని ఆంటిగ్వాలో టెస్టు అరంగేట్రం చేశారు.

తొలి విదేశీ పర్యటనలను గుర్తు చేసుకుంటూ ఆయన మాట్లాడుతూ... భారత జట్టు డ్రెస్సింగ్‌రూమ్ కంటే కరేబియన్ దేశాల్లో తాను ఎక్కువ సౌకర్యంగా అనిపించేదని చెప్పారు. అక్కడి ఆటగాళ్లు స్నేహపూర్వకంగా ఉండేవారని, ముఖ్యంగా Desmond Haynes, దివంగత Malcolm Marshall తనతో ఎక్కువ సమయం గడిపేవారని తెలిపారు. మ్యాచ్‌లు ముగిసిన తర్వాత వారు జమైకా, ట్రినిడాడ్, బార్బడోస్ ప్రాంతాలను చూపించారని, మార్షల్ తన ఇంటికి ఆహ్వానించి పాత మ్యాచ్‌ల వీడియోలు కూడా చూపించేవాడని చెప్పారు.

అలాగే Gordon Greenidge తనకు ఇంగ్లాండ్‌లో ఎదురైన వర్ణ వివక్ష అనుభవాలను వ్యక్తిగతంగా చెప్పుకున్నారని శివరామకృష్ణన్ గుర్తుచేసుకున్నారు. ఇదే సమయంలో భారత జట్టులోనూ కొన్ని వివక్ష ఘటనలు ఎదురైనట్లు తెలిపారు. టీనేజ్‌లో నెట్ బౌలర్‌గా ఉన్న సమయంలో ఓ సీనియర్ ఆటగాడు తనను గ్రౌండ్ సిబ్బంది అనుకుని బూట్లు శుభ్రం చేయమని చెప్పిన ఘటనను గుర్తు చేశారు. అలాగే 1983 పాకిస్థాన్ పర్యటనలో తన పుట్టినరోజు సందర్భంగా కెప్టెన్ Sunil Gavaskar కేక్ ఏర్పాటు చేయగా, ఒక సహచర ఆటగాడు తన చర్మవర్ణంపై వ్యాఖ్య చేశాడని వెల్లడించారు.దేశీయ, అంతర్జాతీయ మ్యాచ్‌ల సమయంలో ప్రేక్షకుల నుంచి కూడా ఇలాంటి వ్యాఖ్యలు వినాల్సి వచ్చేదని ఆయన తెలిపారు. చర్మవర్ణం కారణంగా తనను తక్కువగా చూసిన సందర్భాలు తన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాయని, చిన్న వయసులోనే స్వీయగౌరవం తగ్గిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఐపీఎల్‌కు ముందు ఉప్పల్ స్టేడియానికి రూ.10 కోట్ల మేకోవర్

బలగం టీవి, హైదరాబాద్

ఐపీఎల్ సీజన్‌కు ముందుగా హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉన్న Rajiv Gandhi International Cricket Stadiumకు రూ.10 కోట్ల వ్యయంతో పునర్నిర్మాణ పనులు చేపట్టారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు యాజమాన్య సంస్థ సన్ గ్రూప్ ఈ అభివృద్ధి పనులను చేపట్టింది. ఈ స్టేడియంలోనే భారత స్టార్ బ్యాటర్ Rohit Sharma వన్డే క్రికెట్ చరిత్రలో మూడో డబుల్ సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. రాబోయే ఐపీఎల్ మ్యాచ్‌లను దృష్టిలో ఉంచుకుని ప్రేక్షకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ఈ మార్పులు చేస్తున్నారు.

మౌలిక సదుపాయాల్లో విస్తృత మార్పులు

స్టేడియంలోని మొత్తం 42 కార్పొరేట్ బాక్స్‌లు, లాంజ్‌లను ఆధునికంగా తీర్చిదిద్దుతున్నారు. నాణ్యమైన కలప ఫ్లోరింగ్, లెదర్ సీటింగ్, బార్ తరహా కౌంటర్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టారు. అదనంగా 46 మరుగుదొడ్లను పూర్తిగా పునర్నిర్మించి ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నారు. ప్రేక్షకుల రాకపోకలు సులభంగా ఉండేలా రెండు కొత్త లిఫ్ట్‌లను ఏర్పాటు చేయనున్నారు. వేసవి తీవ్రతను తగ్గించేందుకు 43 కొత్త ఎయిర్ కండీషనర్లను కూడా అమర్చుతున్నారు. ఈ మార్పులతో స్టేడియంలో ప్రేక్షక అనుభవం మరింత మెరుగుపడుతుందని యాజమాన్యం భావిస్తోంది.

ఒలింపిక్ లక్ష్యాలకు తోడ్పాటు

రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఈ పునర్నిర్మాణ పనులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భవిష్యత్తులో ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లకు ఆతిథ్యం ఇవ్వాలనే లక్ష్యానికి ఇవి తోడ్పడనున్నాయని అధికారులు భావిస్తున్నారు. గచ్చిబౌలి స్టేడియంలో అంతర్జాతీయ హాకీ టోర్నీల నిర్వహణ కూడా ఈ దిశగా రాష్ట్ర ప్రయత్నాలకు బలం చేకూరుస్తోంది.

11 నంబర్ జెర్సీలతో బరిలోకి ఆర్సీబీ

- తొక్కిసలాటలో మృతులైన అభిమానులకు నివాళి

బలగం టీవి, హైదరాబాద్

ఐపీఎల్ సీజన్--2026 ప్రారంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఆటగాళ్లు ప్రత్యేకంగా 11 నంబర్ జెర్సీలతో బరిలోకి దిగనున్నారు. మార్చి 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తమ తొలి మ్యాచ్‌ను ఆడనున్నారు. గత ఏడాది జట్టు విజయోత్సవ ర్యాలీ సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది అభిమానులు మృతి చెందిన విషయం తెలిసిందే. వారికి నివాళిగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఫ్రాంచైజీ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి రాజేశ్ మేనన్ వెల్లడించారు. అంతేకాక మృతుల జ్ఞాపకార్థంగా స్టేడియంలో 11 సీట్లను శాశ్వతంగా రిజర్వ్ చేయనున్నట్లు సమాచారం. అంతర్జాతీయ మ్యాచ్‌లు లేదా ఇతర కార్యక్రమాలు జరిగినప్పటికీ ఈ సీట్లు ఖాళీగానే ఉంచనున్నట్లు జట్టు వర్గాలు తెలిపాయి. ప్రారంభ మ్యాచ్‌కు ముందు స్టేడియం ప్రవేశ ద్వారం వద్ద స్మారక ఫలకాన్ని కూడా ఏర్పాటు చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ సీజన్‌లో బెంగళూరులో ఐదు మ్యాచ్‌లు ఆడనున్న ఆర్‌సిబి, మరో రెండు మ్యాచ్‌లను రాయ్‌పూర్‌లో నిర్వహించనుంది.

ఐపీఎల్ ప్రారంభానికి ముందే జట్లకు గాయాల షాక్

కీలక ఆటగాళ్లు దూరం... ఫ్రాంచైజీల్లో ఆందోళన

బలగం టీవి, హైదరాబాద్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ కొత్త సీజన్ మరో 2 రోజుల్లో ప్రారంభం కానుండగా, పలువురు కీలక ఆటగాళ్లు గాయాలు, వ్యక్తిగత కారణాలతో టోర్నమెంట్‌కు దూరమవుతుండటం ఫ్రాంచైజీలను ఆందోళనకు గురిచేస్తోంది. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్ కారణంగా ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. కొందరు గాయాల నుంచి ఇంకా కోలుకోకపోగా, మరికొందరు పనిభారం నియంత్రణ లేదా వ్యక్తిగత కారణాలతో తొలి మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడం లేదు.

కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు భారీ దెబ్బ

కీలక పేసర్ హర్షిత్ రాణా మోకాలి గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌లో గాయపడిన అతడు ఇప్పటికీ కోలుకోలేదు. వెన్ను గాయం కారణంగా ఆకాష్ దీప్ కూడా వైదొలగడంతో అతడి స్థానంలో సౌరభ్ దూబేను జట్టులోకి తీసుకున్నారు. శ్రీలంక ఆటగాడు మతీషా పతిరానా విషయంలో క్రికెట్ బోర్డు అనుమతి కోసం వేచి చూస్తున్నారు.

సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కెప్టెన్ గైర్హాజరీ

గాయం కారణంగా జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ప్రారంభ మ్యాచ్‌లకు దూరంగా ఉండనున్నాడు. అతడి స్థానంలో ఇషాన్ కిషన్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ గాయపడడంతో డేవిడ్ పెయిన్‌ను జట్టులోకి తీసుకున్నారు.

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు ఎదురుదెబ్బ

భారీ మొత్తానికి కొనుగోలు చేసిన ఇంగ్లాండ్ బ్యాటర్ జోష్ ఇంగ్లిష్ తన వివాహం కారణంగా ప్రారంభ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడు. అదే జట్టుకు చెందిన స్పిన్నర్ వానిందు హసరంగ గాయపడడంతో అతడి పాల్గొనడంపై అనిశ్చితి కొనసాగుతోంది.

రాజస్థాన్ రాయల్స్‌లో మార్పులు

ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ శామ్ కరన్ గాయం కారణంగా ఈ సీజన్‌కు దూరమయ్యాడు. అతడి స్థానంలో శ్రీలంక మాజీ కెప్టెన్ దాసున్ షనకను జట్టులోకి తీసుకున్నారు.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు పేసర్ లోటు

జోష్ హేజిల్‌వుడ్ గాయం కారణంగా ప్రారంభ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడం లేదు. గతేడాది నవంబర్ నుంచి అతడు ఆటకు దూరంగా ఉన్నాడు. లీగ్ మధ్యలో తిరిగి జట్టులో చేరే అవకాశం ఉంది.

పంజాబ్ కింగ్స్‌కు కుటుంబ కారణాలు

న్యూజిలాండ్ పేసర్ లాకీ ఫెర్గూసన్ ప్రస్తుతం ఫిట్‌గా ఉన్నప్పటికీ, ఇటీవల తన కుటుంబంలో శిశువు జన్మించడంతో తొలి కొన్ని మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు.

ఇతర జట్లపై ప్రభావం

హామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ఆస్ట్రేలియా పేసర్ నాథన్ ఎల్లిస్ టోర్నమెంట్ మొత్తానికి దూరమవడంతో చెన్నై జట్టుకు దెబ్బ తగిలింది. అలాగే మిచెల్ స్టార్క్‌కు పనిభారం నియంత్రణలో భాగంగా ప్రారంభ మ్యాచ్‌లకు విశ్రాంతి ఇవ్వాలని ఢిల్లీ జట్టు యోచిస్తోంది. ఇలా కీలక ఆటగాళ్ల గైర్హాజరీతో ఐపీఎల్ ప్రారంభానికి ముందే పలు జట్లు తమ వ్యూహాల్లో మార్పులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇటలీ స్టార్ జోరు

బలగం టీవి, హైదరాబాద్

వరల్డ్ నం.2, ఇటలీ స్టార్ ఆటగాడు జానిక్ సినర్ జోరు కొనసాగుతుంది. రెండోరౌండ్లో వరుస సెట్లలో విజయం సాధించి ఏటీపీ 1000 మాస్టర్స్ టోర్నమెంట్లలో నొవాక్ జకోవిచ్ (25 సెట్ల) రికార్డును బద్దలుకొట్టిన సినర్.. తాజాగా ప్రీ క్వార్టర్‌ఫైనల్లో మెరుపు విజయంతో ఆ రికార్డును 28 సెట్లకు మెరుగుపర్చుకున్నాడు. బుధవారం పురుషుల సింగిల్స్‌లో జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో జానిక్ సినర్ 7-5, 7-6(7-4)తో అలెక్స్ మైకల్‌సన్ (అమెరికా)పై గెలుపొందాడు. 15 ఏస్‌లు, 2 బ్రేక్ పాయింట్లతో మెరిసిన జానిక్ సినర్.. తొలి సెట్‌ను 7-5తో నెగ్గాడు. రెండో సెట్లో ఓ బ్రేక్ పాయింట్ సాధించిన అలెక్స్ మైకల్‌సన్ మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో సెట్‌కు తీసుకెళ్లాలా కనిపించాడు. టైబ్రేకర్‌లో 7-4తో పైచేయి సాధించిన సినర్.. రెండో సెట్‌తో పాటు క్వార్టర్‌ఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకున్నాడు. పాయింట్ల పరంగా 71-62తో సినర్ పైచేయి సాధించాడు. సినర్ క్వార్టర్స్‌కు చేరుకోవటంతో.. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఎవరితో ఎవరు తలపడతారనేది తేలిపోయింది. టామీ పాల్ (అమెరికా)తో ఆర్థర్ ఫిల్స్ (ఫ్రాన్స్).. అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)తో ఫ్రాన్సిస్కో సెరుండోలో (అర్జెంటీనా)...మార్టిన్ (స్పెయిన్)తో జిరి (చెక్ రిపబ్లిక్).. జానిక్ సినర్ (ఇటలీ)తో ఫ్రాన్సెస్ టియఫోయె (అమెరికా) పోటీపడనున్నారు.

మహిళల సింగిల్స్‌లో అమెరికా అమ్మాయి, నాల్గో సీడ్ కొకొ గాఫ్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. స్విస్ భామ బెలిండ బెన్సిక్‌తో మూడు సెట్ల సమరంలో కొకొ గాఫ్ పైచేయి సాధించింది. 6-3, 1-6, 6-3తో కొకొ గాఫ్ గెలుపొందింది. ఆరు ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో రాణించిన కొకొ గాఫ్.. పాయింట్ల పరంగా 86-88తో వెనుకంజ వేసింది. తొలి సెట్, నిర్ణయాత్మక సెట్‌ను గట్టి పోటీ ఇస్తూ ఓడిన బెలింద.. రెండో సెట్‌ను 6-1తో ఏకపక్షంగా నెగ్గింది. 3 ఏస్‌లు, 4 బ్రేక్ పాయింట్లతో మెరిసినా.. ఒక్క సెట్‌లోనే ఆధిపత్యం కనబరిచింది. మరో క్వార్టర్‌ఫైనల్లో విక్టోరియా (కెనడా)పై కరొలినా ముచోవ (చెక్ రిపబ్లిక్) 7-6, 7-6(7-5)తో విజయం సాధించింది. ఐదు ఏస్‌లు, ఓ బ్రేక్ పాయింట్లతో ముచోవ పైచేయి సాధించింది. టైబ్రేకర్‌కు దారితీసిన రెండో సెట్‌ను సొంతం చేసుకున్న ముచోవ.. సెమీఫైనల్ బెర్త్ ఖాతాలో వేసుకుంది. పాయింట్ల పరంగా 82-77తో విక్టోరియాపై ముచోవ ఆధిపత్యం చూపించింది. మహిళల సింగిల్స్ మరో రెండు క్వార్టర్‌ఫైనల్స్‌లో ఎలెనా రిబకినా (కజకిస్తాన్)తో జెస్సికా పెగులా (అమెరికా)...అరినా సబలెంక (బెలారస్)తో హేలే (అమెరికా) తలపడనున్నారు.

హైదరాబాద్‌కు చేరుకున్న ప్యాట్ కమిన్స్

బలగం టీవి, హైదరాబాద్

ఐపీఎల్--2026 సీజన్‌కు ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ హైదరాబాద్‌కు చేరుకున్నారు. గాయంతో బాధపడుతున్న ఆయన టోర్నమెంట్ ప్రారంభంలోని కొన్ని మ్యాచ్‌లకు దూరంగా ఉండనున్నట్లు సమాచారం. తన గైర్హాజరీలో జట్టుకు ఇషాన్ కిషన్ నాయకత్వం వహించనున్నాడు. కమిన్స్ ఇప్పటికే జట్టుతో కలిసి సాధన ప్రారంభించి మళ్లీ బౌలింగ్ చేయడం మొదలుపెట్టినప్పటికీ పూర్తి ఫిట్‌నెస్ సాధించేందుకు ఇంకా కొంత సమయం అవసరమని తెలుస్తోంది. ప్రస్తుతం మూడు రోజులకు ఒకసారి బౌలింగ్ చేస్తున్నానని, టోర్నమెంట్ మధ్య నాటికి పూర్తిగా సిద్ధమయ్యేలా ప్రణాళిక రూపొందించామని కమిన్స్ తెలిపారు. ఎలాంటి అంతరాయాలు లేకపోతే టోర్నమెంట్ రెండ్రోర్థం మరియు ప్లే ఆఫ్ మ్యాచ్‌ల్లో ఆడాలని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. జట్టు యాజమాన్యం కూడా ఆయన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. కీలక దశలో కమిన్స్ అందుబాటులోకి వస్తే జట్టుకు బలంగా మారుతాడనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

న్యూజిలాండ్‌పై సౌతాఫ్రికా ఘన విజయం

- 33 పరుగుల తేడాతో గెలుపు... సిరీస్ కైవసం

బలగం టీవి, హైదరాబాద్

న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన ఐదో, చివరి టీ20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 33 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను సౌతాఫ్రికా 3--2తో సొంతం చేసుకుంది.

ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. కానర్ విధ్వంసక ఇన్నింగ్స్‌తో జట్టుకు బలమైన స్కోరు అందించాడు. 33 బంతుల్లోనే 6 భారీ సిక్సర్లు, ఐదు ఫోర్లతో 75 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. రుబిన్ హర్మాన్ 39 పరుగులు చేయగా, వియాన్ ముల్డర్ 31 పరుగులు సాధించాడు. డియాన్ ఫారెస్టర్ 21 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 154 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. బెవన్ జాకబ్స్ 36 పరుగులతో కొంత పోరాటం చేసినప్పటికీ జట్టును గెలుపు తీరానికి చేర్చలేకపోయాడు. ఈ విజయంతో సౌతాఫ్రికా జట్టు సిరీస్‌ను కైవసం చేసుకుని ఆధిపత్యాన్ని చాటింది.

భర్త బుమ్రాను సరదాగా ట్రోల్ చేసిన సంజనా గణేశన్

- వైరల్ మీమ్‌తో సోషల్ మీడియాలో సందడి

బలగం టీవి, హైదరాబాద్

భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాపై ఆయన భార్య సంజనా గణేశన్ సరదాగా ట్రోల్ చేస్తూ చేసిన సామాజిక మాధ్యమాల పోస్టు వైరల్‌గా మారింది. స్నేహితులతో బయటకు వెళ్లే 'బాయ్స్ నైట్' ప్లాన్‌పై చమత్కారంగా స్పందిస్తూ ఆమె ఒక ప్రసిద్ధ మీమ్‌ను పంచుకుంది. ఈ పోస్టులో ఇటీవల విడుదలైన చిత్రం 'ధురంధర్--2'లోని పిందా పాత్ర ఫొటోతో పాటు "ఇల్లు గుర్తురాలేదా జస్సీ?" అనే డైలాగ్‌ను జతచేసింది. ఈ డైలాగ్ ద్వారా స్నేహితులతో బయటకు వెళ్లినప్పుడు బుమ్రాకు ఇంటి జ్ఞాపకం రావడంలేదని సరదాగా సూచించినట్లు నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇదిలా ఉండగా 'ధురంధర్--2' చిత్రం థియేటర్లకే పరిమితం కాకుండా సామాన్యుల సంభాషణల్లో, సామాజిక మాధ్యమాల్లో మీమ్‌ల రూపంలో విస్తృతంగా వినిపిస్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.900 కోట్లకు పైగా వసూళ్లు సాధించి కొత్త రికార్డులు సృష్టిస్తోంది. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ చిత్రంలో రణవీర్ సింగ్‌తో పాటు అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, సంజయ్ దత్, రాకేష్ బేది, సారా అర్జున్ కీలక పాత్రల్లో నటించారు. ముఖ్యంగా రణవీర్ సింగ్--అర్జున్ రాంపాల్ మధ్య యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకుల్లో చర్చనీయాంశంగా మారాయి.

నవదీప్ సైనికి కోల్‌కతా జట్టులో చోటు

బలగం టీవి, హైదరాబాద్

ఐపీఎల్--2026 ప్రారంభానికి ముందే ఆటగాళ్లను గాయాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే పలువురు స్టార్ ఆటగాళ్లు టోర్నమెంట్‌కు దూరమవగా, తాజాగా కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు పేసర్ హర్షిత్ రాణా గాయం కారణంగా ఈ సీజన్‌కు పూర్తిగా దూరమయ్యాడు.

టీ20 ప్రపంచకప్‌కు ముందు దక్షిణాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో రాణా కుడి మోకాలి లిగమెంట్‌కు గాయపడడంతో కేవలం ఒక ఓవర్ మాత్రమే బౌలింగ్ చేశాడు. అనంతరం అతడు శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం విశ్రాంతిలో ఉన్నాడు. దీంతో ఐపీఎల్--2026లో పాల్గొనలేనని జట్టు ప్రకటించింది. రాణా స్థానంలో కుడిచేతి వాటం పేసర్ నవదీప్ సైనిని జట్టులోకి తీసుకున్నట్లు కోల్‌కతా యాజమాన్యం వెల్లడించింది. ఇప్పటివరకు 32 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన సైని 23 వికెట్లు పడగొట్టాడు. భారత్ తరపున అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా 23 వికెట్లు సాధించాడు. ఈ సీజన్‌లో అతడు రూ.75 లక్షలకు కోల్‌కతా జట్టుతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇక గుజరాత్ జట్టులో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. గాయపడిన పృథ్వీరాజ్ యర్రా స్థానంలో ఎడమచేతి పేసర్ ఖేజ్రోలియాను ఎంపిక చేశారు. గతంలో పలు జట్లకు ప్రాతినిధ్యం వహించిన అతడు ఈసారి రూ.30 లక్షలకు జట్టులో చేరనున్నాడు. ఐపీఎల్ ప్రారంభానికి ముందు కీలక ఆటగాళ్ల గాయాలు జట్ల వ్యూహాలపై ప్రభావం చూపనున్నాయని క్రీడా వర్గాలు

పెద్ది షూటింగ్‌లో రామ్‌చరణ్‌కు స్వల్ప గాయం

భయమేమీ లేదని వెల్లడించిన చిత్రబృందం

త్వరగా కోరుకోవాలని పవన్ ఆకాంక్ష

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఏప్రిల్ 30న ఈ చిత్రం విడుదల కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేసేలా దూసుకుపోతోంది చిత్ర యూనిట్. ప్రజెంట్ హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. అయితే, ఈ చిత్రానికి సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న సమయంలో రామ్ చరణ్‌కు గాయం అయినట్టుగా తెలుస్తోంది. ఆయన కంటి సమీపంలో స్వల్ప గాయం అయిందని సమాచారం. ఈ వార్త తెలియగానే అభిమానులు కాస్త ఆందోళన చెందినప్పటికీ, ఇది చాలా చిన్న గాయమని, అభిమానులు భయపడాల్సిన అవసరం లేదని చిత్ర యూనిట్ వర్గాలు తెలిపాయి. అయితే, కంటికి సంబంధించిన గాయం కావడంతో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. అలాగే.. రెండు రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని డాక్టర్లు సలహా ఇచ్చారు. దీంతో.. రెండు రోజుల రెస్ట్ తర్వాత తిరిగి రామ్ చరణ్ పెద్ది సెట్స్‌లో జాయిన్ అవనున్నారు. ఈ షెడ్యూల్ అయిపోయిన తర్వాత.. తదుపరి షెడ్యూల్‌లో ఒక స్పెషల్ సాంగ్ చిత్రీకరణలో పాల్గొననున్నారు. ఇక్కడితో షూటింగ్ దాదాపుగా కంప్లీట్ అయినట్టే. మరోవైపు, ఈ శుక్రవారం మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు కావడంతో మెగా సెలబ్రేషన్స్‌కు సిద్ధమవుతున్నారు అభిమానులు. ఆరోజు పెద్ది టీజర్ లేదా గ్లింప్స్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో చరణ్‌కు గాయం అనే వార్త మెగాభిమానులను కాస్త టెన్షన్‌కు గురి చేసినట్టైంది. తమ అభిమాన హీరో త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా కోరుకుంటున్నారు అభిమానులు. ఈ క్రమంలోనే తాజాగా రామ్ చరణ్ గాయం మీద పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్పందించారు. ఈ మేరకు మీడియాకు సమాచారం అందించారు. త్వరగా రామ్ చరణ్ కోలుకోవాలని పవన్ కళ్యాణ్ ఆకాంక్షిస్తున్నట్లుగా పవన్ కళ్యాణ్ టీం ఒక మెసేజ్ షేర్ చేసింది. అయితే ఇప్పటివరకు రామ్ చరణ్ కి గాయాలు అయినట్లుగా 'పెద్ది' టీం కానీ, రామ్ చరణ్ టీం కానీ ప్రకటించలేదు. కానీ పవన్ కళ్యాణ్ స్పందించడంతో, ఈ వార్త కన్ఫామ్ అయినట్లయింది.

హైదరాబాద్‌లో వారణాసి నిర్మాణం

రాజమౌళి మూవీ కోసం భారీ సెట్టింగ్ రాజమౌళి అంటేనే ప్రతి విషయంలోనూ ఎంత అదనపు శ్రద్ధ తీసుకుంటారో తెలిసిందే. ఇక సెట్స్‌పై ఆయన విజన్ మరింత ప్రత్యేకం. తాజాగా వైరలవుతోన్న వారణాసి సెట్ ఇమేజ్‌లు మరోసారి జక్కన్న పనితీరును చాటిచెబుతున్నాయి. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న చిత్రం 'వారణాసి'. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీంతో దీనికి సంబంధించిన చిన్న అప్‌డేట్ కూడా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ సినిమా కోసం వేస్తోన్న సెట్ ఇమేజ్‌లు వైరల్‌గా మారాయి. ఈ సినిమా కాశీ నేపథ్యంలో సాగే విషయమని తెలిసిందే. దీంతో కాశీ నగరాన్ని తలపించేలా సెట్‌ను నిర్మిస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పురాతన నగరం వారణాసిని అచ్చుగుద్దినట్లు చూపించేలా దాదాపు 700 మీ 400 అడుగుల విస్తీర్ణంలో ఈ భారీ సెట్‌ను నిర్మించారు. వారణాసిలోని ప్రతి వీధి, ప్రతి కట్టడాన్ని తలపించేలా దీన్ని రూపొందిస్తున్నారు. వేల సంఖ్యలో రిఫరెన్స్ చిత్రాలను, కచ్చితమైన కొలతలను వాడినట్లు చిత్ర బృందం పేర్కొంది. ఇక ఈ సెట్‌లో రత్నేశ్వర్ మహాదేవ్ ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందట. దీని గోపురం వంపు తిరిగి ఉంటుందని ఈ సెట్‌లో ఆ ఆలయాన్ని కూడా అదే కోణంలో, అదే ఎత్తులో రూపొందిస్తున్నట్లు సమాచారం. నిర్మాణ సమయంలో ఏ చిన్న అలంకరణను, శిల్పకళలను మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కథ త్రేతాయుగం నుంచి 2027 వరకూ సాగనున్నట్లు తెలుస్తోంది. దీనికి అనుగుణంగా వారణాసి నగరం కాలక్రమేణా ఎలా మారిందో చూపించడానికి సెట్‌లో ప్రత్యేక మార్పులు చేస్తున్నారు. అప్పటి కట్టడాల నంచి నేటి ఆధునిక కాలం వరకు ప్రతీది ప్రత్యేక శ్రద్ధతో నిర్మిస్తున్నట్లు తాజాగా టీమ్ పంచుకున్న ఫొటోలు చూస్తే అర్థమవుతుంది. వారణాసిలోని గంగా నది తీరం, అక్కడి పురాతన కట్టడాలను తలపించేలా హైదరాబాద్‌లో ఒక భారీ సెట్‌ను రాజమౌళి నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి తన సినిమాల్లో లొకేషన్లకు ఇచ్చే ప్రాధాన్యత గురించి అందరికీ తెలిసిందే. ఈ సినిమాలో ఒక కీలకమైన సన్నివేశం వారణాసి నేపథ్యంలో సాగుతుందని, అందుకే ఈ భారీ సెట్ పనులు జరుగుతున్నాయని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మహేష్ బాబు ఈ సినిమాలో ఒక సాహసికుడిగా కనిపించబోతున్నారు. గ్లోబ్ ట్రాటింగ్ నేపథ్యంలో సాగే ఈ కథలో భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా వారణాసి వంటి

పుణ్యక్షేత్రాలను కూడా జోడించడం రాజమౌళి మార్క్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రాలలోని గ్రాండియర్ చూస్తుంటే, రాజమౌళి మరోసారి ఇండియన్ సినిమా స్థాయిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పేలా ప్లాన్ చేస్తున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం మహేష్ బాబు తన మేకోవర్ కోసం కఠినమైన శిక్షణ తీసుకుంటున్నారు. పొడవాటి జుట్టు, గడ్డంతో ఆయన కనిపిస్తున్న లుక్స్ ఇప్పటికే వైరల్ అయ్యాయి.ఐమ్యాక్స్ వెర్షన్‌లోనూ రూపొందుతున్న ఈ సినిమా 2027 వేసవిలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని 120 దేశాల్లో రిలీజ్ చేయాలని రాజమౌళి ఎ÷–లాన్ చేస్తున్నారు. మహేశ్ బాబుకి జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తోన్న ఈ చిత్రంలో విలన్‌గా మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్న విషయం తెలిసిందే.

అన్నదమ్ముల మధ్య చిచ్చుపెట్టిన బ్యూటీ

టీమ్ ఇండియా స్టార్ ఆల్-రౌండర్ హార్దిక్ పాండ్యా సోదరుడు, ఆర్‌సీబీ స్టార్ ఆటగాడు క్రునాల్ పాండ్యా పుట్టినరోజు సందర్భంగా (మార్చి 24) పలువురు క్రికెటర్లు శుభాకాంక్షలు తెలిపారు. అయితే బర్త్‌డే రోజు సొంత తమ్ముడి వల్లే క్రునాల్ కలత చెందాడని అంటున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రారంభం కాబోతోంది. ఇప్పటికే పాండ్యా బ్రదర్స్ తమ జట్లతో కలిసి ప్రాక్టీస్ మొదలెట్టేశారు. అయితే క్రునాల్ పాండ్యా పుట్టినరోజు సందర్భంగా తమ్ముడు హార్దిక్ పాండ్యా శుభాకాంక్షలు తెలపకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. వారిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయని చర్చ జరుగుతోంది.క్రునాల్ పాండ్యా పుట్టినరోజున, అతని భార్య పంఖురి శర్మ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ షేర్ చేసి అతనికి శుభాకాంక్షలు తెలిపారు. "నీ మనసు, నీ ప్రేమ, అన్నీ నాకు తెలుసు. ఆ విషయాన్ని నీకు గుర్తు చేయాలనుకుంటున్నాను. నువ్వు చాలా అందమైన జీవితాన్ని గడిపావు. కుటుంబం, క్రికెట్‌తో సహా ప్రతీదాన్నీ నువ్వు ప్రశాంతంగా, ధైర్యంగా నిర్వహిస్తావు," అని పంఖురి శర్మ పోస్ట్ చేసింది. భార్య పంఖురి శర్మ పెట్టిన ఎమోషనల్ పోస్ట్‌కు భర్త కృనాల్ పాండ్యా కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఈ క్రమంలో కృనాల్ పాండ్యా సోదరుడు హార్దిక్ పాండ్యా అసలు ఎక్కడున్నాడనే ప్రశ్న తలెత్తుతోంది. ఎందుకంటే ప్రతి ఏటా కృనాల్ పాండ్యా పుట్టినరోజున అందరూ సంతోషంగా కలిసి ఉంటారు. కానీ ఈసారి హార్దిక్ పాండ్యా కనీసం విషెస్ చెప్పలేదని ఫ్యాన్స్ అంటున్నారు. హార్దిక్ పాండ్యా వదిన పంఖురి శర్మ పోస్ట్ చేసిన ఫోటో తర్వాత, 'హార్దిక్ పాండ్యా ఎక్కడ?', 'అతను క్రునాల్ పాండ్యాకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఎందుకు చెప్పలేదు?' వంటి ప్రశ్నలను అభిమానులు అడుగుతున్నారు. ఈలోగా, హార్దిక్ పాండ్యా సోషల్ మీడియా ఖాతాలను కూడా పరిశీలించగా, అతను క్రునాల్ పాండ్యాకు ఒక్క శుభాకాంక్షలు కూడా చెప్పలేదని స్పష్టమవుతోంది. ఒకప్పుడు వాళ్లిద్దరూ తమ పుట్టినరోజులను కలిసి జరుపుకునేవారు. చాలా కార్యక్రమాలలో ఇద్దరూ కలిసే కనిపించేవారు. కానీ హార్దిక్ జీవితంలోకి మహికా శర్మ వచ్చినప్పటి నుండి, ఆ ఇద్దరు సోదరుల మధ్య మనస్పర్థలు వచ్చాయని వదంతులు వస్తున్నాయి. పాండ్యా సోదరుల మధ్య పెద్ద గొడవ జరిగిందని సోషల్ మీడియాలో చాలా చర్చ జరుగుతోంది. కానీ ఈ గొడవకు ఖచ్చితమైన కారణం తెలియరాలేదు.

దురంధర్ -2 కలెక్షన్ల సునామీ

బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ, రికార్డులను తిరగరాస్తోంది. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 919 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. ఇందులో ఇండియాలోనే రూ. 695 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు నమోదు చేయడం సినిమా దూకుడుకు నిదర్శనం. వీక్‌డేస్‌లో కూడా కలెక్షన్లు ఏ మాత్రం తగ్గడం లేదు. ఐదో రోజు రూ. 65 కోట్లు, ఆరవ రోజు రూ. 56 కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'ధురంధర్ 2'

దూసుకుపోతోంది. ఇప్పటికే రూ. 200 కోట్ల మార్క్‌ను దాటేసి, గ్లోబల్ స్థాయిలో భారీ వసూళ్లను అందుకుంటోంది.ఈ వేగాన్ని చూస్తుంటే, కేవలం వారం రోజుల్లోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం అని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే అత్యధిక వేగంగా వారం రోజుల్లోనే వెయ్యి కోట్లు రాబట్టిన చిత్రంగా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయనుంది ధురంధర్ 2. సుమారు నాలుగు గంటల భారీ రన్‌టైమ్ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించడం విశేషం. మొదటి భాగం సుమారు రూ. 1400 కోట్ల వసూళ్లు సాధించిన నేపథ్యంలో, 'ధురంధర్ 2' రూ. 2000 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బాలీవుడ్‌లో హిట్ సినిమాలకు లాంగ్ రన్ ఉండటం ఈ అంచనాలకు బలం ఇస్తోంది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ తన పవర్‌ఫుల్ యాక్షన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్. మాధవన్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో మెప్పించారు. మొత్తానికి 'ధురంధర్ 2' భారతీయ సినీ చరిత్రలో కొత్త రికార్డులను సృష్టించే దిశగా దూసుకెళ్తోంది.

సర్కే చునార్ తేరీ సర్కేలో అశ్లీలం తెలియదు

దర్శకుడు ప్రేమ్ స్పందన

ప్రేమ్ దర్శకత్వంలో రాబోతున్న 'కేడీ: దిడెవిల్' సిని మాలోని 'సర్కే చునార్ తేరీ సర్కే' పాట వివాదాస్పదమైన విషయం తెలిసిందే.అన్ని వేదికల్లోనూ ఈ పాటను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అధికారులను ఆదేశించింది. తాజాగా ఈ పాట వివాదంపై దర్శకుడు ప్రేమ్ స్పందిం చారు. తనకు కూడా ఆ హిందీ పాట లిరిక్స్ అర్థం తెలియదని అన్నారు.'ఈ పాట ఐదు భాషల్లో విడుదలైంది. కన్నడలో లిరిక్స్ నేను రాశా. హిందీపై నాకు పట్టులేదు. అందుకే వాటి అర్థం తెలియదు. ప్రస్తుతం దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఒకవైపు యుద్ధం, మరోవైపు గ్యాస్ కొరత.. ఇలాంటి వాటి గురించి చర్చించుకుందాం. అంతేగానీ, ఈ పాట లిరిక్స్‌ను వివాదం చేయాల్సిన అవసరం లేదు' అని అన్నారు. ఇక ఉద్దేశపూర్వకంగానే దీన్ని వివాదం చేస్తున్నారంటూ వస్తోన్న వార్తలను ప్రేమ్ ఖండించారు. తాను వివాదాలకు దూరంగా ఉంటానన్నారు. ఇది ఎమోషనల్ మూవీ అని.. ఇందులో ఆ పాట కేవలం పార్టీలో భాగంగా సరదాగా ఉంటుందని చెప్పారు.ఇటీవల ఈ అంశంపై ప్రేమ్ భార్య రక్షిత కూడా స్పందించిన విషయం తెలిసిందే. గతంలో 'పీలింగ్స్', 'డ్రీమమ్ వేకపమ్', 'చోళీ కే పీచే' వంటి వందలాది పాటలు వచ్చినప్పుడు అందరికీ అవి సాధారణంగానే అనిపించాయని.. ఇప్పుడెందుకు ఈ పాట విషయంలో ఇలా చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. ధ్రువ్ సర్జా కథానాయకుడిగా నటించిన ఈ మూవీలో నోరా ఫతేహి, సంజయ్‌దత్ కీలక పాత్రలు పోషించారు. ఏప్రిల్ 30న ఈ సినిమా విడుదల కానుంది.

ఇన్‌స్టాలోకి అన్నా కొణిదెల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా ఇప్పుడు సోషల్ మీడియాలోకి అడుగుపెట్టి 'అన్నా కొణిదెల'గా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఖాతా ప్రారంభించగానే అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఆమె తొలి పోస్టు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. మొదటి పోస్ట్ సాధారణ పరిచయంకి సంబంధించింది కాగా , రెండో పోస్టులో భర్త పవన్ కళ్యాణ్‌తో కలిసి ఉన్న ఫోటోను షేర్ చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. తన బయోలో ' రష్యన్ హార్ట్ , ఇండియన్ సోల్ అని పేర్కొనడం ద్వారా తన వ్యక్తిత్వాన్ని అందంగా వ్యక్తపరిచారు అన్నా లెజినోవా. రష్యాలో జన్మించిన ఆమె, భారతీయ కుటుంబంలోకి కోడలిగా చేరిన తర్వాత రెండు సంస్కృతుల సమ్మేళనంగా జీవిస్తున్నానని తెలియజేసింది. అలాగే ప్రేమ, కృతజ్ఞతలతో జీవిస్తూ నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని కూడా తన ప్రొఫైల్‌లో తెలియజేశారు. ఇన్‌స్టాగ్రామ్ ఎంట్రీ సందర్భంగా షేర్ చేసిన పోస్టులో, చాలా కాలంగా సోషల్ మీడియాలోకి రావాలని అనుకున్నానని, ఇప్పుడు సరైన సమయం అనిపించిందని తెలిపారు. చిరంజీవి ఆశీస్సులు, పవన్ కళ్యాణ్ మద్దతుతో ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నానని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఆమె ఖాతా ప్రారంభించిన కొద్ది గంటల్లోనే ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటడం విశేషం. అన్నా కొణిదెల ఇన్‌స్టాలోకి ఎంట్రీ ఇవ్వడంతో పవన్ కళ్యాణ్ తన భార్యకు స్వాగతం పలుకుతూ ఒక పోస్ట్ చేశాడు. 'డియర్ అన్నా కొణిదెల, ఇన్‌స్టాగ్రామ్‌లోకి నీకు సాదర స్వాగతం.. ఈ వేదిక ద్వారా నువ్వు అర్థవంతమైన మరియు స్ఫూర్తిదాయకమైన విషయాలను పంచుకుంటావని ఆశిస్తున్నాను' అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు.